J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 46 సంచిక : 5 3.7.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### తగ్గేదే లే...

# మళ్ళీ పేలిన మావి'గన్'



- రాజధానిపై తేల్చిచెప్పిన జగన్
- తమ నిర్ణయంలో మార్పు లేదని స్పష్టం
- మేమొస్తే అమరావతి ఖతమే అంటూ సంకేతాలు
- ఏపీలో మళ్ళీ మొదటికొచ్చిన రాజధాని రగడ

'మీమాంసలకి... తర్జనభర్జనలకి... సంశయాలకి ఇక తావులేదు. డైరెక్ట్ అటాకే'.. అన్నట్లుగా ఏపీ రాజధాని అమరావతిపై జగన్ తేల్చిచెప్పారు. 'మా స్టాండ్ మావిగన్' అని కుండబద్ధలు కొట్టారు. వచ్చే ఎన్నికల్లో ఇదే విషయాన్ని మేనిఫెస్టోలో ప్రకటించి మరీ ప్రజల ముందుకెళ్తామంటూ ప్రకటించారు. జనం ఎవరికి జై కొడతారో చూద్దామంటూ సవాల్ చేశారు. అవినీతి అమరావతి కావాలా? అభివృద్ధికి మార్గం చూపే మావిగన్ కావాలా? ప్రజలే నిర్ణయిస్తారన్నారు. దీంతో ఏకంగా పార్లమెంట్ చట్టం చేసి మరీ రాజధాని ఇదే అని ప్రకటించినా.. వేలకోట్ల ప్రజాధనంతో ఐకానిక్ భవనాలు సిద్ధమైనా.. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టినా.. క్వాంటమ్‌వ్యాలీలు వచ్చినా.. అమరావతిపై వేలాడే అనిశ్చితి కత్తి మాత్రం తొలగిపోదు అని తేలిపోయింది. అది ఓ త్రిశంకుస్వర్గమే అన్న ఆందోళన మరింత పెరిగిపోయింది. పైగా ప్రజావేదిక తరహాలోనే, జగన్ వస్తే.. అమరావతి కూడా హాంఫట్టే అనే భయం ఇటు జనంలోనూ అటు పెట్టుబడిదారులలోనూ మొదలైంది.

2లో

N.B.K.R.I.S.T
(AUTONOMOUS)
Estd: 1979
Vidyanagar, SPSR Nellore Dt. www.nbkrist.org
2026-27 విద్యా సంవత్సరం నుండి నూతనముగా
పాలిటెక్నిక్ కోర్సులు
కోర్సు వివరములు
Counselling Code NBKR
1.కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
2. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్
3. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్
4. మెకానికల్ ఇంజనీరింగ్
కాలేజి బస్సు / హాస్టల్ సౌకర్యం కలదు
అడ్మిషన్స్ వివరములకు
9441572755 / 9440243010

NEDURUMALLI RAMKUMAR
CORRESPONDENT

## 'శ్రీసిటీ'లో చంద్రబాబు - లోకేష్



# రానున్న కాలం.. ఈవీలదే

## 'హీరో మోటార్స్ - గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0' శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి

రానున్న కాలం ఈవీ(విద్యుత్ వాహనాలు)లదే అని, డిమాండ్‌కు తగ్గట్టు ఈవీల ఉత్పత్తికి హీరో మోటార్స్ సంస్థ సిద్దంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. ఈనెల 1న ఆయన శ్రీ సిటీలో రూ.750 కోట్ల పెట్టుబడితో హీరో మోటోకార్ప్ సంస్థ ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతులమీదుగా పలువురికి స్కాలర్‌షిప్‌లు అందించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4లో భాగంగా మార్గదర్శిగా వ్యవహరిస్తూ హీరో మోటార్స్ సంస్థ పేదలకు అండగా నిలుస్తోందని కొనియాడారు. స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ద్వారా డాక్టర్ బ్రిజ్ మోహన్‌లాల్ ముంజల్ 'హీరోస్ ఆఫ్ టుమారో' పేరిట స్కాలర్ షిప్‌లను అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. బ్రిజ్‌మోహన్ లాల్ గొప్ప పారిశ్రామికవేత్తే కాదు.. జాతి నిర్మాణానికి సహకరించిన మహనీయుడని కూడా ఆయన ప్రస్తుతించారు. హీరో మోటార్స్ సంస్థ వేరే రాష్ట్రంలో ప్లాంట్ పెట్టాలనుకుంటే వారితో ప్రత్యేకంగా చర్చించి

11లో



శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్న విద్యామంత్రి లోకేష్, పక్కన శ్రీసిటీ చైర్మెన్ శ్రీనిరాజు, మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

### విద్య - పరిశ్రమల అనుసంధానంతో...

# 'వర్క్ - స్టడీ' డ్యూయల్ మోడల్

## శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి లోకేష్

విద్య-పరిశ్రమల అనుసంధానంతో 'వర్క్-స్టడీ' డ్యుయల్ మోడల్‌గా రూపొందిస్తున్న కొత్త విద్యావిధానంతో ఎస్ఐయూలో విద్యార్థులు తాము విద్యను అభ్యసించే క్యాంపస్‌కు సమీపంలోనే ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలతో కలిసి నేర్చుకునే, పనిచేసే అవకాశాన్ని పొందనున్నారని రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ మంత్రి నారా లోకేష్ చెప్పారు. ప్రపంచప్రసిద్ధి చెందిన పారిశ్రామిక నగరం శ్రీసిటీలో ఆయన ఈనెల 2వ తేదీ గురువారం నాడు శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (ఎస్ఐయు)కి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన యువతకు అపారమైన సామర్థ్యం, ఆశయాలు ఉన్నాయని, వారికి అవసరమైనదల్లా ఉపాధి అవకాశాలతో

11లో

# జగన్‌పై వైసీపీ నేతలే..
# తిరగబడే రోజు దగ్గర్లో ఉంది

## ● మాజీమంత్రి, టీడీపీ నేత సోమిరెడ్డి జోస్యం



రాష్ట్రానికి మరో పిచ్చి తుగ్లక్‌లా జగన్ తయారయ్యాడని, చివరికి వైసీపీ నేతలే జగన్‌పై తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఇటీవల ఆయన అమరావతిలో మాట్లాడుతూ, మూడు రాజధానుల నినాదంతో ఎన్నికలకు వెళ్లిన జగన్‌ను మూడు ప్రాంతాల వారూ ఓడించినా ఇంకా తెలివి రాలేదని విమర్శించారు. జగన్ చెప్పినట్లు, వచ్చే ఎన్నికలు 'అమరావతికీ-మావిగన్‌కి మధ్య పోటీ కాదని, అభివృద్ధికి-అరాచకానికి, సంక్షేమానికి-విధ్వంసానికి మధ్య పోటీ అనీ ఆయన అన్నారు. టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బుల్‌డోజర్‌తో తోసేస్తానంటే ప్రజలు చూస్తూ ఊరుకుంటారా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో జగన్ ముఖం వైసీపీ నేతలు కూడా చూడరని, 3 రాజధానులంటేనే 11సీట్లు వచ్చాయ్... ఇప్పుడు మావిగన్‌కు ఆ 3 సీట్లు కూడా రావని అన్నారు. కనీస మానవత్వం కూడా లేకుండా అమరావతి అడబిడ్డల్ని ఇబ్బంది పెట్టాడని, ఇప్పుడు దేశం మొత్తం అమరావతికి మద్దతుగా నిలవటాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నాడని ఆయన విమర్శించారు. తన పేరులో గన్ ఉందని, రాజధాని పేరులోనూ గన్ పెట్టాలనుకుంటున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. జగన్ పిచ్చి చేష్టలను ఉత్తరాంధ్ర-రాయలసీమ గొడ్డలి పార్టీ నేతలు ఒక్కరు కూడా ప్రశ్నించలేకపోతున్నారా అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఉండగా పులివెందుల పిల్లిలా పరదాలు కట్టుకుని,చెట్లు నరుకుతూ జగన్ తిరిగాడని, ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నాడు కాబట్టే జగన్ కూడా రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరుగుతున్నాడని అన్నారు. ఇకనైనా జగన్ మనిషిగా మానవత్వంతో మాట్లాడాలన్నారు. వేలకోట్ల అవినీతి కేసుల్లో న్యాయస్థానం తీర్పు కోసం 14ఏళ్లుగా రాష్ట్రం మొత్తం ఎదురుచూస్తోందని ఆయన జగన్ కేసులను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు.

# 3 నుండి 6 వరకు.. జిల్లాలో వెంకయ్య పర్యటన



భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ఈనెల 3 నుండి 6 వరకు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3వతేదీ శుక్రవారం ఉదయం 6.15 గంటలకు ఆయన తిరుపతిలో బయలుదేరి, ఉదయం 8.15 గంటలకు వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో బస చేస్తారని పేర్కొన్నారు. జూలై 4వ తేదీ స్వర్ణభారత్ ట్రస్ట్‌లోనే బస చేయనున్నారని, జూలై 5వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు నెల్లూరులోని వి.పి.ఆర్. కన్వెన్షన్ సెంటర్, గొలగమూడిరోడ్డులో నిర్వహించే వెంకయ్య'నాయకుడు' పుస్తక పరిచయం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడి నుంచి స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుని అక్కడే బసచేస్తారని పేర్కొన్నారు. జూలై 6వ తేదీ (సోమవారం) ఉదయం 5.40 గంటలకు స్వర్ణ భారత్ ట్రస్ట్ నుండి బయలుదేరి, ఉదయం 7.10 గంటలకు తిరుపతి కి వెళ్లి అక్కడినుంచి హైదరాబాద్‌కి వెళ్తారని వివరించారు.

# విద్యార్థులకు ప్రోత్సాహకాలు

నెల్లూరు దర్గామిట్టలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి 10వ తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు స్థానిక స్పందన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఉత్తమస్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులకు 5వేల రూపాయల వంతున నగదు బహుమతులిచ్చారు. మంగళవారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెడ్మాస్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదువుకుని సమాజంలో ఉన్నతస్థాయిలో రాణించాలని అన్నారు. నెల్లూరు రూరల్ ఎంఇఓ-2 మురళీధర్, ఫౌండేషన్ చైర్మెన్ నాగేశ్వరరావు, అధ్యక్షుడు సురేంద్రబాబు, నరసింహకొండ దేవస్థానం ఇఓ గోపి, డాక్టర్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

# మళ్ళీ పేలిన మావి'గన్'

(మొదటిపేజీ తరువాయి)

అదే నిజమైతే.. ఆంధ్రుల రాజధాని కల రాజకీయ రణరంగంలో కనుమరుగు కాకతప్పదా..? పుష్కర కాలంగా పుట్టెడు కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న అమరావతి ఓ నాన్ స్టాప్ దీన.. కథా చిత్రంగా కొనసాగాల్సిందేనా..? అనే సందేహాలు పలు వర్గాల నుండి వ్యక్తమవుతున్నాయి.

### పుష్కరకాలంలో.. పుట్టెడు కష్టాలు..
### 'అమరావతి ఓ నాన్‌స్టాప్.. కథాచిత్రం'

దేశంలో స్వాతంత్ర్యం తరువాత అనేక రాష్ట్రాలు ఏర్పడ్డాయి. వాటికి అనేక కొత్త నగరాలు కూడా రాజధానులుగా ఏర్పాటయ్యాయి. ఏపీ రాజధాని అమరావతిలా ఇంత వివాదాస్పదం అయిన ప్రాంతం ఎక్కడా లేదంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే అమరావతి అనే పేరు గత దశాబ్దకాలానికిపైగా ఆంధ్రప్రజల నోట్లో అంతలా నానుతోంది. రాష్ట్రం మధ్యలోనే రాజధాని ఏర్పాటు అంటూ నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా తన తొలి అంకంలో చంద్రబాబు ఓ బృహత్తర నగర రూపకల్పనకు నాంది పలికారు. అనుకున్నదే తడవుగా రైతుల నుంచి 34 వేల ఎకరాలు సేకరించారు. విజయవాడ, గుంటూరు మధ్యలోని కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని రాజధాని ఏర్పాటు కోసం ఎంపిక చేశారు. అయితే, తన అనుచరులకు, తన పార్టీ కార్యకర్తలకు ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకే చంద్రబాబు అమరావతిని ఎంపిక చేశారంటూ మొదట్లో కొన్ని విమర్శలు వచ్చాయి. కృష్ణానదికి వరదలొస్తే నీటిపై తేలియాడే నగరంగా అమరావతి మారిపోతుందని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ తీవ్ర స్థాయిలో ఆరోపించింది. దీనికితోడు విభజన తర్వాత అప్పుల కుప్పగా మారిన ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి గుదిబండ అని, రూ.5 లక్షల కోట్ల నిధులు వెచ్చించి రాజధాని నగరాన్ని నిర్మించడం సాధ్యమయ్యే పని కాదని ఆ పార్టీ అధినేత జగన్ గతంలో ఎన్నోసార్లు తేల్చేశారు. అమరావతిపై అన్ని లక్షల కోట్లు కుమ్మరించాడా.. విభజన తరువాత అత్యంత లోటు బడ్జెట్‌తో ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్‌ను రుణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే అవుతుందని కొందరు మేధావులు కూడా అభిప్రాయపడ్డారు. అయినా, తన కలల ప్రాజెక్టు అమరావతిపై చంద్రబాబు వెనక్కి తగ్గలేదు. అనుకున్నదే తడవుగా 2015లో అప్పటి ప్రధాని మోడీని పిలిచి ఘనంగా శంకుస్థాపన చేశారు. చకచకా కొన్ని తాత్కాలిక భవనాలను కూడా నిర్మించారు.

### జగన్ రాకతో..

2019లో జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడడంతో అమరావతి రూపు కోల్పోయిందనే చెప్పాలి. ఆ పార్టీ నాయకులు కొందరు అమరావతిని స్మశానం, మురికికూపం అంటూ ఎద్దేవా చేశారు. తర్వాత జగన్ అసెంబ్లీలో మూడు రాజధానుల ప్రకటన చేయడం, అమరావతి శాసన రాజధానిగా ఉంటుందని ప్రకటించడంతో భూములిచ్చిన రైతులు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. వారికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ, వామపక్ష పార్టీలు సంఘీభావం పేరుతో మద్దతు తెలిపాయి. దీంతో 1,631 రోజుల పాటు సుదీర్ఘ ఉద్యమం సాగింది. అయితే కాలక్రమంలో మూడు రాజధానుల నినాదం జగన్‌ను అదురుదెబ్బ కొట్టడంతో మరోసారి అమరావతిపై ఆశలు చిగురించాయి.

### ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడడంతో..

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు రెండోసారి ముఖ్యమంత్రి కావడంతో అమరావతి నిర్మాణానికి అడుగులు వేగవంతమయ్యాయి. ఇక ప్రధాని మోడీయే స్వయంగా వచ్చి రెండోసారి అమరావతి పనులను పునఃప్రారంభించారు. దీంతో అక్కడ వివిధ నిర్మాణాలు స్పీడందుకున్నాయి. రూ.15 వేల కోట్లతో కేంద్ర రుణసాయం, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కేటాయింపులతో ఐకానిక్ టవర్లు, హైకోర్టు భవనాలు, సచివాలయ పనులు జోరందుకున్నాయి. పైగా 11 కేంద్ర ప్రభుత్వ సంస్థలు తరలి రావడం, విదేశీ పెట్టుబడులు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ఏర్పాటు, క్యాంటమ్‌వ్యాలీ కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దే విషయంపై చంద్రబాబు ప్రత్యేకదృష్టి సారించడంతో ఆంధ్రుల కలల రాజధాని త్వరలోనే సాకారం కానుందనే ఆశలు సర్వత్రా నెలకొన్నాయి.

పైగా ఏకంగా పార్లమెంట్‌లో ప్రత్యేక తీర్మానం ద్వారా రాష్ట్ర విభజన చట్టంలో మార్పులు చేసి, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతే అని స్పష్టం చేయడంతో ఇకపై అమరావతిని ఎవరూ కదల్చలేరనే వాదనలు తెరపైకి వచ్చాయి. భూములిచ్చిన అమరావతి రైతులు సైతం హమ్మయ్యా అంటూ సంబరపడ్డారు. అయితే, అంతలోనే అంతరాయం అన్నట్లుగా.. జగన్ మరోసారి అమరావతిని వ్యతిరేకిస్తూ ప్రకటన చేయడంతో రాజధాని రగడ మరోసారి రాజుకుందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

### జగన్ తాజా ప్రకటనతో సందిగ్ధం..

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ తాజాగా.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు 'అమరావతి వర్సెస్ మావిగన్'గా ఉంటాయని తేల్చేశారు. 'మావిగన్ మా విధానం' అంటూ స్పష్టంగా ప్రకటించారు. తగ్గేదేలే.. అంటు మళ్ళీ మావి'గన్'ను పేల్చారు. భవిష్యత్‌లో మావిగన్ కావాలి అనుకునే వారు జగన్‌కు, అమరావతి కావాలి అనుకునేవారు చంద్రబాబుకు ఓటేస్తారని.. ఇందులో ఎలాంటి సంశయం అక్కరలేదని స్పష్టం చేశారు. దీంతో ఇన్నాళ్లూ అమరావతి ప్రాంత ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు మరోసారి తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో ఇక్కడో ఆసక్తికరమైన విషయం కూడా కనిపిస్తోంది. ఎన్నికలకు మరో మూడేళ్లు సమయం ఉన్నా, జగన్ అప్పుడే అమరావతి తేనెతుట్టెను ఎందుకు కదుపుతున్నారనే విషయం విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. అయితే అంతరాల్లోకి వెళితే.. దీర్ఘకాలిక వ్యూహంతోనే జగన్ మావిగన్ ప్రస్తావన తెచ్చినట్లు కనిపిస్తోంది. ఎందుకంటే చంద్రబాబు రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక, అమరావతిని ఏకైక శాశ్వత రాజధానిగా తీర్చిదిద్దేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. తమ పార్టీ మద్దతుపై కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపిస్తుండడంతో ఏతావాతా మోడీని ప్రసన్నం చేసుకుని అమరావతి పనులను జెట్ స్పీడ్‌తో పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన కార్యాలయాలు, విదేశీ పెట్టుబడిదారులు అమరావతికి ఒక్కొక్కటిగా జతకూడుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించే పెట్టుబడిదారులకు ఓ హెచ్చరిక అన్నట్లుగా జగన్ "అమరావతి వర్సెస్ మావిగన్" ప్రకటన చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అమరావతికి పెట్టుబడుల రాక పెరిగితే భవిష్యత్‌లో రాజధానిని మార్చడం కష్టతరమౌతుందని, అందుకే ఇప్పుడే హెచ్చరిస్తే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ధైర్యంగా ముందుకు రారని, ఫలితంగా తామొస్తే మావిగన్‌కు మార్గం సుగుమం చేసుకోచ్చని జగన్ అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అమరావతికి తాము పూర్తి వ్యతిరేకం అని తేల్చిచెప్పినట్లు కనిపిస్తోంది.

### చంద్రబాబు ప్రతివ్యూహాలు..

జగన్ సంచలన ప్రకటనతో అటు రాజధానికి భూములిచ్చిన రైతుల్లోనూ, ఇటు కూటమి వర్గాల్లోనూ కలవరం మొదలైనట్లు కనిపిస్తోంది. జగన్ వస్తే మరోసారి రాష్ట్రం గాడితప్పుతుందనే భయాలు లోలోన వారిలో స్పష్టంగా కనిపిస్తున్నాయనడంలో సందేహం లేదు. గతంలో ప్రజావేదికను కూలగొట్టినట్లే జగన్ అమరావతినీ కాలగర్భంలో కలిపేస్తారేమో అంటూ కొందరు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. దీంతో ఎలాగైనా జగన్‌కు అడ్డుకట్ట వేయాలని చంద్రబాబు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జగన్ మొదట్లో అమరావతికి మద్దతు ప్రకటించడం, ఆ తర్వాత మూడు రాజధానులు అంటూ మూడుముక్కలాట ఆడడం, ఆపై మావిగన్ అంటూ కొత్త ప్రతిపాదన తేవడం, తర్వాత అమరావతి పరిరక్షణ పేరుతో హంగామా చేయడం వంటి అంశాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ నిలకడలేని నిర్ణయాలను ప్రజల ముందు ఎండగట్టాలని భావిస్తున్నట్లు కనిపిస్తోంది.

ఇందుకోసం ఆయన ఐదు అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేడర్‌ను సిద్ధం చేసినట్లు, ఆమేరకు ఆయా జిల్లాల నేతలకు ఆదేశాలు కూడా అందినట్లు సమాచారం. వాటిలో ప్రధానంగా "జగన్ ఏకైక ఎజెండా.. అమరావతిని నాశనం చేయడం" అన్న విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం, రెండోది "అమరావతిలో పెట్టుబడులను అడ్డుకుంటున్నాడు" అనే అంశం పై ప్రజల్లో చైతన్యం కల్పించడం, మూడోది "భూములిచ్చిన రైతుల త్యాగాలను అవమానపరుస్తున్నాడు" అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, నాలుగోది "రాష్ట్ర అభివృద్ధికి జగన్ అడ్డంకులు సృష్టిస్తున్నాడు" అనే విషయానికి విస్తృత ప్రచారం కల్పించడం. పై నాలుగు అంశాలతో పాటు "వైఎస్సార్‌సీపీ గత విధ్వంస పాలన"ను జనాలకి మరోసారి గుర్తు చేయడం అనే వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నది తమ నాయకుడి వ్యూహం అని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. వీటి ఆధారంగానే ఎక్కడికక్కడ ప్రజల్లో వైఎస్సార్‌సీపీ అధినేత నిలకడ లేని నిర్ణయాలను, చంచల మనస్తత్వాన్ని ప్రజల కళ్లకు కట్టాలని, తద్వారా జగన్ నైజాన్ని రాష్ట్ర ప్రజలకు తెలిజేయాలని ప్రణాళిక రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా జగన్ పేల్చిన మావిగన్‌తో మరోసారి రాజధాని రగడ రాజుకుందనేది నిజం. ఇప్పటికే వైద్యకళాశాలలను పీపీపీ(పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్) మోడల్‌లో నిర్మించాలని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే, దీన్ని వ్యతిరేకిస్తూ జగన్ తామొస్తే టెండర్లను రద్దు చేస్తామంటూ ప్రకటించారు. దీంతో పెట్టుబడిదారులెవరూ ఈ విషయంలో ముందుకు రాలేదు. అదే తరహాలో జగన్ తాజా ప్రకటన అమరావతిలోనూ పెట్టుబడులపై ప్రభావం చూపిస్తుందా..? అదే నిజమైతే చంద్రబాబు దాన్ని ఎలా అడ్డుకుంటారు..? అసలు ఆంధ్రుల రాజధాని కల ఎప్పటికి నెరవేరుతుంది..? అనే అంశాలు ప్రస్తుతం జన బాహుళ్యంలోనే కాకుండా, సామాజిక మాధ్యమాలలో సైతం చక్కర్లు కొడుతున్నాయి. ఒకటిమాత్రం నిజం... తాజాగా జగన్ చేసిన "మావిగన్ వర్సెన్ అమరావతి" ప్రకటన మాత్రం రానున్న రాష్ట్ర రాజకీయ రణరంగాన్ని మరింత వేడెక్కించి అగ్గి రాజేస్తుందనడంలో సందేహం లేదు. ఆ మంట రాష్ట్రానికి ఏం తంటా తెస్తుందనేదే అసలు సమస్య అని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం..!

# టీడీపీ పార్లమెంట్ స్థాయి సమావేశం



నెల్లూరులో జులై 1న టీడీపీ పార్లమెంట్ స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీదా రవిచంద్ర ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొని పార్టీ సంస్థాగత బలోపేతాన్ని మరింత పటిష్ఠం చేయడం, తదితర అంశాల గురించి చర్చించారు.

# నెల్లూరే..నెంబర్ 1

## కలెక్టర్ హిమాన్షును అభినందించిన ముఖ్యమంత్రి



రాష్ట్రంలో నెల్లూరుజిల్లా అగ్రస్థానంలో ఉందని, అందుకు కృషిచేసిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా యంత్రాంగం అభినందనీయులని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. చిల్లకూరు మండలం పున్నపువారిపాలెంలో బుధవారం జరిగిన 'పేదల సేవలో ప్రజావేదిక' కార్యక్ర మంలో ముఖ్యమంత్రి పాల్గొని, జిల్లాలోని వివిధ శాఖల పని తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత సంవత్సరం రెండో స్థానంలో ఉన్న నెల్లూరు జిల్లా ప్రస్తుతం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం విశేషమన్నారు.

### ఎస్పీ డా. అజిత పనితీరు భేష్



జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పనితీరు ప్రశంసనీయమని, గంజాయి నియంత్రణ, మహిళలపై నేరాల అరికట్ట డంలో ఆమె సమర్థవంతంగా పనిచేస్తు న్నారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అత్యంత ప్రాధాన్యత గల ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో మంచి పనితీరు కనబరిచిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును, పలు శాఖల అధికారులను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా 57 సేవల మూల్యాంకనంలో కేవలం రెండు సేవల్లో మాత్రమే జిల్లా స్వల్పంగా వెనుకబడి ఉందని, మిగిలిన అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించి రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు.

# అరాచకాలకు.. అభివృద్ధికీ మధ్యనే ఎన్నికలు

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



రానున్న ఎన్నికలు వైసీపీ అరాచ కాలకు - టీడీపీ అభివృద్ధికి మధ్య జరుగనున్నాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికలు అమరావతికి- మావి గన్‌కి మధ్యనే అన్న జగన్‌మోహన్‌రెడ్డి మాటలు విన్నాక, ప్రజలు వైసీపీకి ఆ 11 సీట్లు కూడా ఎలా ఇచ్చారో అనిపి స్తోందన్నారు. వచ్చే ఎన్నికలు జరిగేది.. అమరావతికి-అమలాపురానికి మధ్య కాదనీ, కడపకి-కమలాపురానికి మధ్య కాదని, చంద్రబాబు విజన్‌కి - జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసక రాజకీయాలకు మధ్యేనని ఆయన చెప్పారు. ప్రజల భవిష్యత్తుకు - వ్యక్తిగత అహంకారానికి మధ్య, ధర్మానికి-అధర్మానికి మధ్య ఎన్నికలు జరుగనున్నాయన్నారు. రాజధాని విషయంలో నాలుగుసార్లు నాలుగు మాటలు మార్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన విమర్శించారు. ఈ విషయంలో కూటమి పార్టీలు మొదటినుండి ఒకే విధానంతో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతి అని, అమరావతి అభివృద్ధిని ఎవ్వరూ అడ్డుకోలేరని, పార్లమెంటు సాక్షిగా అమరావతి రాజధానిగా నిర్ధారణ అయ్యిందని కూడా ఆయన స్పష్టం చేశారు. అమరావతి అద్భుతంగా రూపుదిద్దుకుంటోందని.. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతికి వ్యతిరేకంగా 'మావిగన్'ను తీసుకు వస్తామని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడంలో అర్థం లేదన్నారు. కురుక్షేత్రంలో ధర్మం గెలిచినట్లే.. ప్రజా స్వామ్యంలో కూడా చివరికి గెలిచేది ప్రజల ఆకాంక్షలేనన్నారు. ఆ తీర్పు ఏమిటో 2024లో ప్రజలు ఇప్పటికే చూపించారని, మళ్ళీ చూపించడానికి కూడా సిద్ధంగా ఉన్నారని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.


# ప్రజల సంక్షేమమే.. ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి ఆనం



శ్రీకొలనులో గిరిజనులకు పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం

ప్రజల సంక్షేమమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. జులై 1న ఆయన ఆత్మకూరు నియోజకవర్గం ఏఎస్‌పేట మండలంలోని శ్రీకొలను గిరిజన కాలనీలో లబ్ధిదారులకు ఆయన స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి గిరిజనులతో ఆత్మీయంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రతినెలా 1వ తేదీన ఇళ్లవద్దకే వచ్చి లబ్ధిదారులకు పింఛను అందిస్తున్నామని, ఈ గ్రామంలో 305 మంది లబ్ధిదారులకు 12.86లక్షల రూపాయల పింఛను ఇస్తున్నామని, ఆత్మకూరు నియోజకవర్గంలో 16.22 కోట్లకు పైగా, జిల్లాలో 2,87,345 మంది లబ్ధిదారులకు రూ. 127.23 కోట్లకు పైగా పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వం అందజేస్తోందని వివరించారు.

లాయర్
జులై 03, 2026

# అధిక జనాభాతో..అనేక సవాళ్లు!

అది ఏదైనా సరే, 'అతి' సర్వత్ర వర్జయేత్'.. అన్నారు పెద్దలు. ఇది ఎంతో అనుభవంతో చెప్పిన మాట. అతిగా తింటే అనారోగ్యం. మితాహారం శ్రేయోదాయకం. అదేవిధంగా, అధిక జనాభా కూడా అనర్థదాయకమే మరి!.. అయితే, మన దేశంలోనే కాదు, అనేక దేశాల్లో నానాటికీ జనాభా విపరీతంగా పెరిగిపోతూ ఉంది. ప్రపంచ జనాభా సంఖ్య దాదాపు 830 కోట్లకు పైగానే చేరుకుందంటే అతిశయోక్తేమీ కాదు. అందులోనూ అత్యధిక జనాభా కలిగిన దేశం మనదే. ఇప్పటికే మన దేశ జనాభా 147 కోట్లు దాటిపోయింది. జనాభాలో చైనాని కూడా మించిపోయి, ప్రపంచంలో మనమే అగ్రగామిగా ఉంటున్నాం. వచ్చే ఏడాదికి మన జనాభా సంఖ్య 149 కోట్లు దాటేస్తుందని కూడా అంచనా. అయితే, ఇలా జనాభా మితిమీరిపోతే దేశ ఆర్థికవ్యవస్థకు భారంగా పరిణమిస్తుందని నిపుణులు చెప్తున్నారు. అంతేకాదు, అటు ప్రకృతి పర్యావరణ పరంగా, ఇటు ఆర్థిక-సామాజిక పరంగా కూడా సమస్యలు కొనితెచ్చుకున్నట్లేనని అంటున్నారు. జనాభా పెరిగినందువల్ల ప్రపంచంలోనే మనం అతిపెద్ద దేశంగా అవతరించినా, భవిష్యత్తులో ఇది ఆహారభద్రతకు పెను సవాలుగా మారవచ్చని కూడా హెచ్చరిస్తున్నారు. ఆహారం కొరత ఏర్పడి, ఉపాధి లేక జనం అవస్థలు పడాల్సి ఉంటుందంటున్నారు. ప్రస్తుతం దేశ ఆర్థికవ్యవస్థ గణనీయంగా పెరుగుతోందని మనం గొప్పలు చెప్పుకుంటున్నా, వాస్తవానికి దేశంలోని అత్యధిక శాతం మంది ప్రజలు ఇంకా కూటికి, గుడ్డకి కూడా నోచుకోని దుస్థితిలో ఉన్నారు. ఇళ్ళు లేనివారు, ఉద్యోగాలు రానివారు, అప్పుల ఊబిలో కూరుకుపోతున్నవారు, కుటుంబాలను పోషించుకోలేక నానా యాతనలు పడుతున్నవారు, గిట్టుబాటు ధరలు లేక రైతులు, కష్టానికి తగ్గ ఫలితం రాక శ్రామికులు, కష్టజీవులు సమస్యల సుడిలో కొట్టుకుపోతున్నారు. జనాభా పెరుగుదల అవసరమని, భవిష్యత్తులో యువశక్తిని పెంపొందించుకునేందుకు జననాల సంఖ్య బాగా పెరగాలనే వాదనలు ఇటీవలి కాలంలో ప్రబలమవుతున్నా, పుట్టే బిడ్డలకు తగ్గ పౌష్టికాహారం, ఇతరత్రా వసతులు ఎక్కడ నుంచి తేవాలనే సవాళ్లు ఎదురవుతున్నాయి. మరోవైపు వృద్ధుల సంఖ్య కూడా పెరిగిపోతోంది. కాలుష్యం దేశాన్ని చుట్టుముడుతోంది. జనాభా పెరుగుదల మూలంగా ఇలా ఎక్కడ చూసినా సమస్యల సవాళ్లే ఎదురవుతున్నాయి. ప్రస్తుతానికి యువతకి, యువశక్తికి మనదేశంలో కొదవ లేకపోయినా, రానున్న మరో పాతికేళ్లలో వీరంతా వృద్ధులవుతారు కనుక అప్పటి పరిస్థితి ఏమిటన్నది దేశాన్ని పట్టిపీడిస్తున్న మరో పెద్ద సమస్యగా ఉంటోంది. నానాటికి వృద్ధజనాభా మరింత భారీగా పెరుగుతుందని, యువశక్తి-శ్రామిక శక్తి బాగా తగ్గిపోతుందని, కనుక భారత్ ఇప్పటికైనా కళ్ళు తెరవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జనాభా పెరిగితే వసతులు పెరగాలి. కానీ, ఆ పరిస్థితి కనిపించకపోవడాన్ని ప్రభుత్వాలు గమనించాలి. జనాభా పెరుగుదల వరమా, లేక శాపమా అని చర్చించుకుంటే ఎక్కువశాతం రెండోదాన్నే వేలెత్తి చూపుతున్నారు. అందుకు కారణాలు లేకపోలేదు. అనాదిగా దేశంలో పేదరికం, అసమానతలు, అవినీతి అక్రమాలు పెరుగుతూనే ఉన్నాయి తప్ప తరగడం లేదు. ధరలు పెరిగిపోయి సామాన్యులకు జీవనం భారమవుతోంది. నిరుద్యోగం మరో రాకాసిలా వెంటపడుతూనే ఉంది. అసమతుల్యత, అసమానత పెరిగిపోతోంది. కష్టపడేవారికి కానికాలం వచ్చింది. ఎంతోకాలంగా ఇలాంటి విషమ సమస్యల వలయంలో మన సమాజం సతమతమవుతూనే ఉంది. ఇలా ఇంకెంత కాలం?.. ముందు ఈ అరిష్టాల నుంచి బయటపడాలి. శ్రమించే జనాభా, కష్టపడి పనిచేసే యువత, అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోయే పరిస్థితులూ ఉంటే జనాభా పెరగడం మంచిదే, కాదని ఎవరంటారు?.. కానీ, అందుకు తగ్గ పరిస్థితులు మన దేశంలో ఉన్నాయా అన్నదే నిష్పాక్షికంగా తర్కించుకోవాలి. ఈ అనర్థాలన్నిటినీ అధిగమించాలంటే అందుకు ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి. పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా కనీస మౌలిక సదుపాయాలూ కల్పించేందుకు ప్రభుత్వాలు సమాయత్తం కావాలి. 2050 నాటికి మనదేశంలో వృద్ధుల సంఖ్య 34కోట్లకు దాటుతుందని ఐక్యరాజ్య సమితి అంచనా. ఈ నేపథ్యంలో వృద్ధులు సమాజానికి భారం కాకుండా, ఇప్పటినుంచే వారి క్షేమానికి, సకల జన సంక్షేమానికీ అనువైన బాటలు వేయాలి. కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ విషయాలపై శ్రద్ధ పెట్టి, అన్ని రంగాల్లో ప్రజల అభ్యున్నతికి పూర్తిస్థాయిలో సమగ్రమైన ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలి. జనాభా ఎంతపెరిగినా ఎలాంటి ఇబ్బందులు లేని స్థితికి దేశం ఎదగాలి. పెరుగుతున్న జనాభా దేశప్రగతికి ఆలంబనగా నిలిచేలా ప్రభుత్వాలు ఇప్పటినుంచే సకల చర్యలు తీసుకోవాలి.

(..జులై 11, ప్రపంచ జనాభా దినోత్సవం)

# పల్లెలను.. ఆర్థిక కేంద్రాలుగా మార్చాలి

మనసులో మాట 104

ఇటీవల 'నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' జర్నల్‌లో ప్రచురితమైన అంతర్జాతీయ పరిశోధన ప్రపంచ దేశాలకు ఒక స్పష్టమైన హెచ్చరికను పంపింది. రాబోయే పాతికేళ్లలో ప్రపంచవ్యాప్తంగా వంద కోట్ల మంది, గ్రామాల నుంచి నగరాలకు వలస వెళ్లనున్నారని ఆ నివేదిక తేల్చింది. ప్రతి రెండు నెలలకూ భూమిపై ఒక సరికొత్త 'న్యూయార్క్' నగరం పుట్టుకొచ్చే స్థాయిలో ఈ పట్టణీకరణ సాగుతోందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. సాధారణంగా ఈ గణాంకాలను ఆర్థిక వృద్ధికి, ఆధునికతకు సంకేతాలుగా కొందరు సంబరపడవచ్చు. కానీ, లోతుగా విశ్లేషిస్తే ఇది సంబరపడాల్సిన విషయం కాదు, అత్యంత ఆందోళనకరమైన అంశం.

జనసాంద్రత అంతా ఒకే చోట కేంద్రీకృతం కావడం అనేది మానవ మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు ఏ రకంగానూ శ్రేయస్కరం కాదు. పట్టణీకరణలో విపరీతమైన వేగం వనరుల సద్వినియోగానికి కాక, వనరుల విచక్షణారహిత దుర్వినియోగానికి దారితీస్తుంది. జనసాంద్రత ఒకేచోట ఉండటం వల్ల వచ్చే ముప్పును మనం కోవిడ్–19 మహమ్మారి సమయంలో చూశాం. కరోనా వైరస్ నగరాల్లో సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. అదే వైరస్ పట్టణాల నుంచి పల్లెలకు వ్యాపించడానికి, పల్లె నుంచి పల్లెకు విస్తరించడానికి చాలా ఎక్కువ సమయం పట్టింది. ఎందుకంటే ప్రజలు ఒకే చోట గుంపులుగా కాకుండా దూరదూరంగా విస్తరించి ఉండటం వల్ల ప్రకృతి సహజంగానే వారికి ఒక రక్షణ కవచాన్ని ఇచ్చింది. మెగా సిటీల నమూనా మహమ్మారుల వ్యాప్తికి ఎలా 'హాట్‌స్పాట్'లుగా మారుతాయో ఈ అనుభవం నిరూపించింది. ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో నివసించే ప్రజలు చిన్న పట్టణాలు, పల్లెల్లో ఉండేవారి కంటే మూడు రెట్లు ఎక్కువగా అంటువ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యల బారిన పడే ముప్పు ఉందని శాస్త్రీయ అధ్యయనాలు కూడా స్పష్టం చేస్తున్నాయి.

పట్టణీకరణ కేవలం ఆరోగ్య రంగాన్నే కాదు, పరిపాలనా వ్యవస్థలను సైతం కుప్పకూలుస్తుంది. జనాభా అంతా నగరాలకే పరిమితమైనప్పుడు పరిపాలనా, నిర్వహణా వ్యవస్థలపై మోయలేనంత పనిభారం పడుతుంది. సహజంగా, పారదర్శకంగా సేవలు అందడానికి పరిపాలనా కేంద్రీకరణ ఎప్పుడూ మంచిది కాదు. అధికారం, యంత్రాంగం ఒకే చోట కేంద్రీకృతమైతే క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించడం, సకాలంలో స్పందించడం అసాధ్యంగా మారుతుంది.

పట్టణీకరణలో వేగానికి మూలకారణం ఉపాధి. మన దేశంలో ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వలసలు విపరీతంగా పెరగడానికి కారణం అక్కడ ఐటీ, ఐటీ అనుబంధ సేవలు, వాటిని నమ్ముకుని పెరిగిన సేవా రంగాలు మాత్రమే. కానీ భారతదేశానికి ఉన్న అసలైన బలం, అంతర్జాతీయంగా మంచి అవకాశం ఉన్న రంగాన్ని మనం విస్మరిస్తున్నాం. ఆర్థిక నిపుణుల లెక్కల ప్రకారం, ప్రపంచంలోనే అత్యధిక సాగుభూమి (సుమారు 17.5 కోట్ల హెక్టార్లు) ఉన్న దేశాల్లో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. ప్రపంచ బ్యాంకు, ఎఫ్.ఎ.ఓ నివేదికల ప్రకారం, ప్రపంచంలోని 20 కీలక వ్యవసాయ వాతావరణ మండలాలు మన దేశంలో ఉన్నాయి. అంటే, ప్రపంచంలో ఏ దేశంలో పండే పంటనైనా పండించగల అద్భుతమైన వైవిధ్యం మన సొంతం.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత అనేది అతిపెద్ద సవాలుగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం, 2050 నాటికి ప్రపంచ జనాభా అవసరాలకు ఇప్పుడున్న దానికంటే 60% ఎక్కువ ఆహార ఉత్పత్తి అవసరం. ఈ నేపథ్యంలో, భారతదేశం తన వ్యవసాయ రంగాన్ని ఆధునీకరిస్తే, అంతర్జాతీయ ఆహార సరఫరా వ్యవస్థకు కేంద్రీకృత దేశంగా మారగలదు. ఇప్పటికే బియ్యం, గోధుమలు, సుగంధ ద్రవ్యాల ఎగుమతుల్లో భారతదేశం కీలక పాత్ర పోషిస్తోంది. ఐటీ రంగంపై పెడుతున్న దృష్టిని, పెట్టుబడులను గనుక కోల్డ్ స్టోరేజ్ నెట్‌వర్కులు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు, అగ్రి–టెక్ వైపు మళ్లిస్తే, భారతదేశం ప్రపంచ దేశాలకు అన్నపూర్ణగా మారుతుంది. దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడి, ఎక్కడికక్కడ కోట్లాది మందికి స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. ఫలితంగా నగరాలకు వలసలు తగ్గుతాయి. ఒకవేళ పట్టణీకరణ అనివార్యమైతే, అది ప్రకృతి వనరులను ధ్వంసం చేసే విధంగా ఉండకూడదు. ప్రస్తుతం జరుగుతున్న కాంక్రీట్ విస్తరణ వల్ల చెరువులు, చిత్తడి నేలలు కరవైపోతున్నాయి. ఫలితంగా భూతాపం పెరగడం, సముద్ర జలాలు వేడెక్కి మట్టాలు పెరగడం, అకాల వర్షాలు, వరదలు వంటి పర్యావరణ విపత్తులు సంభవించి మానవ జీవితం నరకప్రాయంగా మారుతోంది.

నగరాల్లో రవాణా పేరిట చేపడుతున్న మెట్రో రైలు వంటి భారీ ప్రాజెక్టుల వల్ల పర్యావరణ విధ్వంసంతో పాటు వనరుల దుర్వినియోగం ఎక్కువవుతోంది. మెట్రోల కంటే ఆర్థికంగా, పర్యావరణపరంగా తక్కువ ఖర్చయ్యే బిఆర్టీఎస్ వంటి ప్రత్యామ్నాయ, మెరుగైన రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయాలి. దీనివల్ల వనరుల వినియోగం తక్కువగా ఉంటుంది.

ప్రకృతి అంటే కేవలం రోడ్ల పక్కన పెంచే చెట్లు మాత్రమే కాదు. చెరువులు, వాటిలోకి ప్రవహించే సహజ నీటి వాలు కాలువలు, వీటన్నింటినీ ఆలంబనగా చేసుకుని జీవించే పక్షులు, జంతువులు, కీటకాలు.. ఇవన్నీ కలిస్తేనే ప్రకృతి. ఈ సమస్త జీవరాశుల 'జీవన చక్రం' దెబ్బతినకుండా పట్టణీకరణ జరగాలి. పీనాస్ అధ్యయనం హెచ్చరించినట్లు, పట్టణీకరణ పెరిగే కొద్దీ నగరాలు ట్రాఫిక్ జామ్‌లు, కాలుష్యంతో పాటు నేరాల మయంగా మారుతాయి. కాబట్టి మెగా సిటీల మోజును వీడి, పల్లెలను ఆర్థిక కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ, అత్యంత ముందస్తు ప్రణాళికతో పర్యావరణాన్ని కాపాడుకుంటూ సాగే సమతుల్య వికేంద్రీకరణే నేటి తక్షణ అవసరం.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# అయోధ్య నిధుల వ్యవహారంలో పారదర్శకత అవసరం!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

అయోధ్య ఆలయంలో ఇటీవల బయటపడ్డ నిధుల దోపిడీ వ్యవహారం గమనిస్తే భక్తులలో అనేక సందేహాలు కలుగుతున్నాయి. అయోధ్య నగర అభివృద్ధి, రామ మందిర నిర్మాణ సంబంధిత పనుల కోసం కేటాయించిన వేల కోట్ల రూపాయల నిధుల వినియోగంపై కూడా ఇప్పుడు సామాన్య భక్తులలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి మీడియా కథనాలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన 'నిధుల స్వాహా' ఆరోపణలు ఈ ఆందోళనను మరింత పెంచాయి. రామ మందిరం కోసం దేశవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులు చిన్న చిన్న విరాళాలు ఇచ్చారు. అదేవిధంగా అయోధ్య మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వ బడ్జెట్ నుంచి భారీ నిధులు కేటాయించారు. ఇది ప్రజాధనం. కాబట్టి ప్రతి రూపాయి లెక్క చెప్పాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉంది. నిధుల వినియోగం, టెండర్లు, కాంట్రాక్టుల వివరాలు, పనుల పురోగతి నివేదికలు బహిరంగంగా అందుబాటులో లేనప్పుడు, అవినీతి ఆరోపణలకు తావు ఏర్పడుతుంది. 'స్వాహా' అన్న మాటలు బలపడకుండా ఉండాలంటే, ప్రతి ఖర్చును ఆడిట్ చేసి వెబ్‌సైట్‌లో పెట్టాలి. భక్తులకు సందేహాలు నివృత్తి కావాలంటే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో లేదా సిఏజి ద్వారా అయోధ్య ప్రాజెక్టుల పూర్తి ఆడిట్ చేయించాలి. ప్రతి 3 నెలలకు ఒకసారి ఖర్చులు, పనుల వివరాలతో బహిరంగ నివేదిక విడుదల చేయాలి. నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆధారాలు ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అయోధ్య అనేది కోట్లాదిమంది హిందువుల విశ్వాసానికి కేంద్రం. అలాంటి పవిత్ర ప్రాజెక్టులో ఏ చిన్న మచ్చ కూడా దేశ ప్రజలు సహించరు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటించడం ద్వారానే ప్రభుత్వం, ఆలయ ట్రస్టు తమ విశ్వసనీయతను నిలబెట్టుకోగలవు. భక్తుల నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

– వి.వి. రాఘవశర్మ,
రంగనాయకులపేట, నెల్లూరు.

# శాకాహార నగరంగా వారణాసి.. అభినందనీయం!

అతి పవిత్ర పుణ్యక్షేత్రం కాశీ నగర పరిధిలోని మాంసం, చేపలు, కోళ్ల దుకాణాలను ఆరు నెలల్లో శివార్లకు తరలించి, నగరాన్ని శాకాహార నగరంగా మార్చాలని ఆ నగర కార్పొరేషన్ అధికారులు తీసుకున్న నిర్ణయం ఎంతో ఆహ్వానించదగినది. కాశీ.. కేవలం ఒక నగరం కాదు, అది భారతదేశ ఆధ్యాత్మిక హృదయం. గంగా తీరాన, విశ్వనాథుడి సన్నిధిలో మోక్షం కోసం దేశం నలుమూల నుండి లక్షలాదిమంది భక్తులు నిత్యం ఇక్కడకు వస్తారు. అటువంటి పవిత్రక్షేత్రంలో మాంస విక్రయాలు నగర వాతావరణంపై, పరిశుభ్రతపై ప్రభావం చూపుతున్నాయన్నది వాస్తవం. వాటిని నగర శివార్లకు తరలించడం వల్ల నగర మధ్యభాగం పరిశుభ్రంగా, భక్తి వాతావరణంతో నిండిపోతుంది. ఇప్పటికే గుజరాత్‌లోని 'పాలితానా' 2014 నుండి ప్రపంచంలోనే ఏకైక పూర్తి శాకాహార పట్టణంగా ఉంది. ఇప్పుడు వారణాసి దేశంలో రెండవ శాకాహార నగరంగా అవతరించబోతుండడం మనందరికీ గర్వకారణం. ఈ నిర్ణయం వల్ల ధార్మిక పర్యాటకం మరింత పెరుగుతుంది. అహింస, శాకాహారం అనే భారతీయ విలువలకు ఇది ఒక గొప్ప గౌరవం. మొత్తంగా, కాశీ నగర పవిత్రతను కాపాడే దిశగా వేసిన ఈ అడుగు చరిత్రాత్మకం. ఈ సదుద్దేశానికి అన్ని వర్గాల మద్దతు లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. – లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

# ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో.. పాలిటెక్నిక్ కోర్సులు

- ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీవారు ఈ విద్యా సంవత్సరం (2026-27) నుంచే పాలిటెక్నిక్ కోర్సులను నూతనంగా ప్రారంభించనున్నారు. కళాశాల విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాన్ని మరింతగా పెంపొందించేందుకు ఆ కోర్సులు దోహదపడతాయని వారు భావిస్తున్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల ఇంజనీరింగ్ కోర్సులను కూడా ఈ విద్యాసంవత్సరం నుంచి ఆరంభిస్తున్నారు.

## అనేక కంపెనీల్లో విద్యార్థులకు ఉద్యోగాలు

ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో చదువుకుంటున్న విద్యార్థుల ప్రతిభా పాటవాలను గుర్తిస్తూ అనేక కంపెనీల వారు ఆ విద్యార్థులకు తమ కంపెనీల్లో ఉద్యోగాలిస్తున్నారు. వివిధ బహుళజాతి కంపెనీల్లో ఎన్‌బీకేఆర్ విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తుండడం విశేషం. ప్రత్యేకించి శ్రీసిటీ, మాంబట్టు-మేనకూరు సెజ్‌లలో ఉన్న వివిధ కంపెనీల నుంచి విభాగాధిపతులు వచ్చి ఏటా ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తుంటారు. మేనకూరు సెజ్‌లో ఉన్న జపాన్‌కి చెందిన మైదెన్ కంపెనీ ఈ కళాశాలతో చేసుకున్న ఎంఓయులో భాగంగా, ఏటా ఫైనలియర్ చదువుతున్న ఇక్కడి విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారు. ఈ కళాశాలలో ఉన్న యువతీయువకులకు, కంపెనీల అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులు శిక్షణ ఇస్తూ, వారి జీవితాలకు మేలు బాటలు వేస్తున్నారు.

## విద్యారంగంలో విశిష్ట గుర్తింపు

ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ 1979వ సంవత్సరంలో ప్రారంభమైంది. గత 47 సంవత్సరాలుగా ఈ కళాశాలలో ఎందరో విద్యార్థులు ఉత్తమ శ్రేణిలో చదువులు చదువుకుని దేశవిదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉంటున్నారు. విశిష్ట గుర్తింపులు పొందిన ఈ కళాశాల విద్యారంగంలో అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తనయుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో ఎన్‌బీకేఆర్ ఐఎస్టీకి అటానమస్ స్టేటస్‌తో పాటు, ఎన్‌బీఏ, ఎన్ఏసిసి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏ-గ్రేడ్ గుర్తింపులతో ఈ కళాశాల విద్యారంగంలో ఆణిముత్యంగా వెలుగొందుతోంది కూడా.

## ఉద్యోగ కల్పనే ధ్యేయంగా

ఈ నేపథ్యంలో, కృష్ణపట్నం పోర్టుకి అనుబంధంగా ఉన్న పలు పరిశ్రమలు, వివిధ సెజ్‌లలో ఉన్న కంపెనీల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ విద్యాసంవత్సరం నుంచి ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో వివిధ రకాల పాలిటెక్నిక్ కోర్సులను ప్రారంభిస్తున్నారు. తమ కళాశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థికి ఉద్యోగ కల్పనే ధ్యేయంగా, వివిధ రకాల పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తగు శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతోందని కళాశాల కరెస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కొత్త కోర్సులు విద్యార్థుల జీవితాలకి ఉపాధి అవకాశాల మెరుగుకు ఉపకరిస్తాయని, వారి భవితకు మరో మైలురాయిగా నిలుస్తాయని వారు ఆకాంక్షిస్తున్నారు.

### వెంకయ్య'నాయకుడు'

# పుస్తక పరిచయం..5న





భారత 13వ ఉప రాష్ట్రపతి, నెల్లూరు ముద్దుబిడ్డ.. ముప్పవరపు వెంకయ్యనాయుడు జీవిత విశేషాల గురించి ఇటీవలే ఆవిష్కృతమైన వెంకయ్య 'నాయకుడు' పుస్తక పరిచయ కార్యక్రమం నెల్లూరులో కూడా ఏర్పాటు చేస్తున్నారు. జులై 5వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి గొలగమూడిరోడ్డులో ఉన్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. వెంకయ్యనాయుడు సమక్షంలో ఈ కార్యక్రమం జరుగనుంది. ఆత్మీయ అతిథులుగా రాష్ట్ర పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌లు పాల్గొననున్నారు. పల్లె నుంచి పద్మవిభూషణ్ వరకు, ఉదయగిరి నుంచి ఉప రాష్ట్రపతి వరకు వెంకయ్యనాయుడు జీవనప్రస్థానాన్ని సీనియర్ పాత్రికేయులు మాశర్మ రచించారు. వెంకయ్య పుట్టిన గడ్డపై ఈ పుస్తకాన్ని పరిచయం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం ఏర్పాటుచేస్తుండడం సంతోషదాయకం.

### మెనూ ప్రకారం..

# భోజనం పెట్టాలి

జి.సుధీర్‌బాబు

ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు చెప్పారు. మంగళవారం ఆయన కలువాయి మండలంలోని పిఎంశ్రీ స్కూల్స్‌ని సందర్శించారు. కలువాయి జడ్పీహెచ్ఎస్ పాఠవాలను, కనుపూరుపల్లి మండల పరిషత్ పాఠశాలను కూడా ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, స్కూల్స్ నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నట్లు తెలిపారు. కలువాయి పాఠశాలలో ఉద్యోగ విరమణ చేస్తున్న సుందర రామయ్యను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టరు అబ్బాస్ అలీ, ఉపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి, పెంచలప్పయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### అందరి సహకారంతోనే..
# రొట్టెలపండుగ విజయవంతం
#### - - రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ - -



అందరి సహకారంతోనే బారాషహీద్ దర్గా రొట్టెలపండుగ విజయవంతమైందని, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. రొట్టెల పండుగ పూర్తయిన సందర్భంగా మంగళవారం సాయంత్రం దర్గా ఆవరణలోని ఏపీ టూరిజం పార్కు ఆవరణలో వక్ఫ్‌బోర్డు, దర్గా ఫెస్టివల్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రొట్టెలపండుగ ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. రొట్టెల పండుగలో ఐదు రోజులపాటు విశిష్ట సేవలందించిన వివిధ విభాగాల అధికారులను, సిబ్బందిని, దర్గా కమిటీ సభ్యులను జ్ఞాపికలతో సత్కరించారు.

# జడ్పీ సీఇఓ శ్రీధర్‌రెడ్డికి వీడ్కోలు



శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పంచాయతీ అధికారులు

నెల్లూరుజిల్లా పరిషత్ సీఇఓగా పనిచేస్తూ మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన లక్కిరెడ్డి శ్రీధర్‌రెడ్డిని జడ్పీ పాలకవర్గం, అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా పంచాయతీ అధికారి వసుమతి, జడ్పీ డిప్యూటీ సీఇఓ బ్రహ్మయ్య, అన్ని మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, జడ్పీ సిబ్బంది పాల్గొని శ్రీధర్‌రెడ్డిని పూలమాలలతో సత్కరించి వీడ్కోలు చెప్పారు.

# ఫ్రెండ్స్ వాకర్స్.. డాక్టర్స్ డే




కేకును కట్ చేస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ సభ్యులు

నెల్లూరులోని ఏసీస్టేడియంలో బుధవారం నాడు ఒకేసారి మూడు ముఖ్యమైన రోజులకు సంబంధించిన కార్యక్రమాలు జరిగాయి. డాక్టర్స్ డే-చార్టెర్డ్ అకౌంటెంట్స్ డే, ఎస్‌బీఐ డేలను పురస్కరించుకుని వాటి విశిష్టతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ చక్రపాణి, ఏవీపీ రాఘవరెడ్డి మాట్లాడుతూ, వాకర్స్‌వారు డాక్టర్స్ డేని జరపడం సంతోషకరమన్నారు. బాధ్యతాయుతమైన పౌరులను తయారుచేయడంలో వాకర్స్ సంస్థ ముందుంటుందని వాకర్స్ 203- గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు చెప్పారు. తొలుత కేకు కట్ చేసి అందరికీ పంచారు. ఫ్రెండ్స్ వాకర్స్ ప్రతినిధులు షేక్ నజీర్ అహ్మద్, శానంపూడి సుబ్బరాయుడు, మాగంటి ప్రసాద్, యు.గోవర్ధన్, పత్తిపాటి రమణయ్య, కె.వెంకటరమణ, బెల్లం చెంచయ్యనాయుడు, కాగొల్లు శివయ్య, పీవీ మోహన్‌రెడ్డి, ఎంఎన్ చౌదరి, నైజాం వెంకటేశ్వర్లు, అనంతరామారావు, పి.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

# ఈవీఎంల వద్ద పటిష్ట బందోబస్తు



ఈవీఎం గోడౌన్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలుచేస్తూ ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన మూడు గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు ఈవీఎం గోడౌన్ల వద్ద భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె విజయ్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, పి.కోటేశ్వర్ రెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు బానిసలైతే..జీవితాలు చిత్తు!

- జిల్లా ఎస్పీ అజింత వేజెండ్ల హెచ్చరిక



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, ఏఎస్పీ దీక్ష

మత్తుమందులు, మాదకద్రవ్యాల (డ్రగ్స్)కి బానిసలైతే వారి జీవితం సర్వనాశనమవుతుందని, భవిష్యత్తు అంధకారబంధురంగా మిగిలి పోతుందని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఇటీవల నెల్లూరు పురమందిరంలో జరిగిన అవగాహన సదస్సులో ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ, డ్రగ్స్ వాడడం ప్రమాదకరమన్నారు. వాటికి లోబడితే ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, సమాజంలో గౌరవం ఉండదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత అలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా అందరితో డ్రగ్స్‌కి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. నగర ఏఎస్పీ దీక్ష, ఆర్ఐఓ వరప్రసాద్ పాల్గొన్నారు.

# ఆత్మహత్యలు.. వద్దనే వద్దు

ఆత్మహత్యలు చేసుకోరాదని, సమస్యలు ఎన్నున్నా ఆత్మవిశ్వాసంతో జీవించాలని సమగ్ర బాలల సంరక్షణ పథకం పీఓ సమత విద్యార్థులకు అవగాహన కలిగించారు. నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌లో మల్లెల సంజీవయ్య స్మారక ఉన్నత పాఠశాలలో ఆత్మహత్యల నివారణపై జరిగిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. క్లిష్టమైన సమస్యలేమైనా ఉంటే తల్లితండ్రులతో, స్నేహితులు-బంధువులతోనూ మాట్లాడి వాటిని పరిష్కరించుకోవాలే కానీ ఆత్మహత్యల ఆలోచనలే చేయకూడదని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, సఖి వన్‌స్టాప్ సెంటర్ సోషల్ కౌన్సిలర్ కమల, జ్యోత్స్న పాల్గొన్నారు.

# కళారూపాలతో ప్రజాచైతన్యం

ప్రజల సమస్యలపై కళారూపాలను రూపొందిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని ప్రజానాట్యమండలి జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు సూర్యనారాయణ, నగర కార్యదర్శి బొమ్ము శ్రీధర్ చెప్పారు. మంగళవారం నెల్లూరులో జరిగిన ప్రజానాట్యమండలి నగర మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. సమస్యల పోరాటాల్లోనూ ప్రజానాట్యమండలి కళారూపాలు కీలకపాత్ర పోషించాయని వారు తెలిపారు. ఈనెల 5న ప్రజానాట్య మండలి జిల్లా మహాసభలు జరుగుతాయని, 10 నుంచి 12వతేదీ వరకు కర్నూలులో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం 24 మందితో ప్రజానాట్యమండలి నగర కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షులుగా వేణు, కార్యదర్శిగా శ్రీధర్, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరావు, భాగ్యమ్మ, కోశాధికారిగా నారాయణ పాల్గొన్నారు.

# పేదలను ఆదుకుంటున్న..సీఎంఆర్ఎఫ్
#### మంత్రి నారాయణ



సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ

సీఎం సహాయనిధి పేదలకు ఒక వరమని, దీని ద్వారా కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఎంతో ఉదారంగా నిధులు మంజూరు చేస్తున్నారని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 56 మంది లబ్ధిదారులకు 50,34,141 రూపాయల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఇటీవల ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. గత రెండేళ్ల కాలంలో నియోజకవర్గంలో 489 మందికి 4,55,33,833 రూపాయల విలువైన చెక్కులను అందజేశామని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా పేదలకు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్విఘ్నంగా కొనసాగిస్తూనే ఉండడం హర్షదాయకమన్నారు.

# బీఎల్ఏలతో.. పర్వతరెడ్డి సమావేశం



నెల్లూరు మైపాడుగేట్ సెంటర్ శ్రీనివాసనగర్‌లో 3,4,5 డివిజన్లకు సంబంధించిన బీఎల్ఏలతో వైస్సార్సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు కొండిదల సుధీర్‌లతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం.. ఇప్పించిన తర్వాత దాన్ని ఫిల్ చేయడంలో కూడా ఓటర్‌కు అవగాహన కల్పించాలని, వైస్సార్సీపీ మద్దతుదారుల ఓట్లు తొలగించకుండా ఓటర్లను అప్రమత్తం చేయాలని సూచించారు.

# విభేదాలు వీడి..ఐక్యంగా ఉండండి
#### - జనసేన నాయకుడు నాయకర్ హితవు -



పార్టీలో ఉండేవారు విభేదాలు విడనాడి. అందరూ కలసికట్టుగా ఉండాలని, పార్టీ బలోపేతానికి ఐక్యంగా కృషిచేయాలని జనసేన సమాచార సేకరణ కమిటీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ హితవు పలికారు. నెల్లూరు టౌన్‌హాలులో మంగళవారం జనసేన కమిటీలకు దరఖాస్తుల స్వీకరణపై జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన కార్యకర్తలు, నాయకులంతా కలిసిమెలిసి ఉంటూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలన్నారు. స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు.

# డెంగ్యూ మాసోత్సవాలు

జులై 1 నుంచి 31వ తేదీ వరకు జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం నాడు నెల్లూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత మాసోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. డెంగ్యూ వ్యాధి నివారణకు సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి ఆ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని ఆమె సూచించారు.




# పీ4లో.. సర్వేపల్లి సూపర్

## • సోమిరెడ్డిని మెచ్చుకున్న ముఖ్యమంత్రి




సీఎం చంద్రబాబునాయుడుకి 'విజన్ సర్వేపల్లి' బుక్‌లెట్‌ని అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పీ4 కార్యక్రమాల అమలులో రాష్ట్రస్థాయిలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దావంటూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. మంగళవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సోమిరెడ్డి కలవగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 కార్యక్రమానికి సీఎస్ఆర్ నిధులు అనుసంధానించి సర్వేపల్లిలో రికార్డు స్థాయిలో కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని సోమిరెడ్డిని కొనియాడారు. చిన్నారులకు 1841 సైకిళ్లు, గ్రామాల్లో సోలార్ వీధిలైట్లు, వాటర్ ప్లాంట్లు, గిరిజన కాలనీల దత్తత, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు తదితర కార్యక్రమాలు చేపట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెట్టడం, వేలాది మందికి ఆధార్ కార్డులు ఇప్పించేందుకు చర్యలు చేపట్టడంపై సీఎం ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీ4 కార్యక్రమాలతో పాటు సర్వేపల్లిలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన 'విజన్ సర్వేపల్లి' బుక్‌లెట్‌ని సోమిరెడ్డి సీఎం చంద్రబాబునాయుడుకి అందజేశారు.

# జోరుగా.. హుషారుగా.. బోటు షికారు



బారా షహీద్ దర్గాలో 5రోజుల పాటు జరిగిన 'రొట్టెల పండుగ'లో మొదటిరోజు ఏర్పాట్లను పర్యవేక్షించి అనంతరం స్వర్ణాల చెరువులో బోటు షికారు చేస్తున్న మంత్రి పొంగూరు నారాయణ, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

## జడ్పీ ఇన్‌చార్జి
# సీఇఓగా వసుమతి




నెల్లూరు జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సిఇఓగా వసుమతి నియమితులయ్యారు. జడ్పీ సీఇఓగా పని చేస్తున్న ఎల్.శ్రీధర్‌రెడ్డి, మంగళవారం ఉద్యోగ విరమణ చేయడతో, ఆ స్థానంలో వసుమతిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికే వసుమతి ఇన్‌చార్జి జిలా పంచాయతీ అధికారిణిగా విధులు నిర్వహిస్తున్నారు కూడా.









# గూడూరు డివిజన్

## విందూరు రోడ్డుకి మోక్షం



విందూరు రోడ్డుకి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్

గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ ప్రజలకిచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. గూడూరు మండలం, విందూరు గ్రామానికి స్థానిక మధురెడ్డి కాలనీ వద్ద నూతన రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విందూరు రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉందని, గత వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టి కూడా వేయలేదని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ప్రచారానికి వచ్చినప్పుడు రోడ్డు నిర్మాణం గురించి ప్రజలు తెలియజేశారని, కూటమి ప్రభుత్వంవస్తే రోడ్డు వేస్తామని హామీ ఇచ్చామని అన్నారు. ఇచ్చిన హామీమేరకు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తున్నామన్నారు. కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, రహీం, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటేశ్వరరాజు, శ్రీదేవి భారతి పాల్గొన్నారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎప్పుడు పూర్తిచేస్తారు?

**• పంటా శ్రీనివాసులురెడ్డి**



మాజీ ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు, పనబాక లక్ష్మి కృషి ఫలితం గూడూరు పట్టణంలోని రెండు ప్రధాన ప్రాంతాలను అనుసంధానించే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమై 14 సంవత్సరాలు పూర్తవుతున్నా, ఇప్పటికీ పూర్తికాకపోవడం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఈ విషయమై కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి బ్రిడ్జిని పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ విషయమై గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.



గూడూరు రాజీవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ చైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు



గూడూరులో జరిగిన జడ్పీటీసీ యామినిరెడ్డి జన్మదిన వేడుకలలో పాల్గొని మాట్లాడుతున్న మేరిగ మురళీధర్, పక్కన ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, యామినిరెడ్డి




చిల్లకూరు మండలం, మన్నెగుంట గ్రామంలో ఉచిత న్యూరాలజీ మెడికల్ క్యాంప్‌లో డాక్టర్ బిందుమీనన్, లయన్స్ క్లబ్ సభ్యుల నుండి సత్కారాన్నందుకుంటున్న క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్



గూడూరులోని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ భవనంలో జరిగిన నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ గౌరవ అధ్యక్షులు పుట్టా శంకరయ్య, శ్యాంప్రసాద్, మధు, లక్ష్మయ్య, సేకరాచార్య

# స్ఫూర్తిదాయకం.. వెంకయ్య'నాయకుడి' జీవితం




**సీ**నియర్ పాత్రికేయులు మాశర్మ రచించిన వెంకయ్య'నాయకుడు' ఒక చారిత్రక గ్రంథం. మారుమూల పల్లె నుంచి ఢిల్లీ వరకు అంచెలంచెలుగా ఎదిగిన ఒక నాయకుని చరిత్ర. 'మహాసత్వులనేవారు తమ జీవితకాలంలో ఎన్ని ఆటంకాలు ఎదురయినా, ఎన్ని సమస్యలు చుట్టిముట్టినా మొక్కవోని ధైర్యంతో, చిత్తశుద్ధితో తమ లక్ష్యసిద్ధికి పాటుపడి విజయం సాధిస్తారు' – అనేది పెద్దల మాట. అలాంటి చారిత్రక వ్యక్తి మన వెంకయ్యానాయుడు. ఆయన జీవితంలోని ఒడిదుడుకులు, వాటిని ఆయన అధిగమించిన తీరు ఈ గ్రంథంలో కనిపిస్తాయి. పాఠకులకు గొప్ప స్ఫూర్తినిస్తాయి. అదే ఈ గ్రంథం యొక్క ప్రయోజనం.

'చరిత్రను వెంకయ్యానాయుడు నుంచి కానీ, ఆయన నుంచి చరిత్రను గానీ వేరుచేయలేము' – అంటారు జస్టిస్ ఎన్.వి.రమణ గారు. ఎంత సత్యం! వెంకయ్య సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. నెల్లూరుజిల్లా, వెంకటాచలం మండలంలో శ్రీరామ్‌పూర్ అనే కుగ్రామం ఆయన స్వగ్రామం. ఆయనకు ఏ గాడ్‌ఫాదర్ లేడు. స్వయంకృషితో పైకి వచ్చిన వ్యక్తి ఆయన. నిజాయితీ, నిబద్ధత, నిక్కచ్చిగా వుండటం ఆయన సహజ గుణాలు. 'వాక్చాతుర్యం' ఆయనకు పుట్టుకతో వచ్చిన వరం. పలు భాషలు మాట్లాడగలగడం ఆయనకున్న సౌలభ్యం.

'నయతి ఇతి నాయకః' అన్నట్లు నడిపించేవాడు, నాయకత్వం వహించేవాడు నాయకుడు. ఆ గుణం వెంకయ్యలో అధికం. బోగాది దుర్గాప్రసాద్, సోమేపల్లి సోమయ్య, తెన్నేటి విశ్వనాథం, వాజ్‌పేయి, అద్వానీ వంటి మహానాయకుల శిష్యరికం ఆయన్ను చిన్ననాటి నుండే ప్రభావితం చేసింది. ప్రభంజనం సృష్టించడానికి తోడ్పడింది.

110 రూ.లతో నెల్లూరులో విద్యార్థి జీవితం గడపడం ఆయనకు ఆర్థిక క్రమశిక్షణను నేర్పింది. నిరాడంబరత్వాన్ని అలవాటు చేసింది. అదే ఆయన్ను జీవితాంతం ఆదర్శంగా నిలబడేటట్టు చేసింది. పదుగురి మెప్పు పొందేటట్లు చేసింది.

వక్తృత్వం, కర్తృత్వం, నేతృత్వం, నాయకత్వం, మిత్రత్వం అనే పంచభూతాల సమ్మిళితం ఆయన నాయకత్వం – మాతృభాషాభిమానం ఆయనకు పెట్టని కిరీటం. ఢిల్లీలో ఉన్నప్పుడు సుమారు 16 ప్రాంతాలలో విడిది చేసినపుడు కనీసం రోజూ 8 వారపత్రికలను ఆయన చదివేవాడు. పఠనాభిలాష నాయకుడికి వుండాల్సిన అవశ్య లక్షణం.

'మాతృభాష కళ్లలాంటిది. పరాయిభాష కళ్లజోడు లాంటిది. కళ్లే లేకపోతే కళ్లజోడుండి ప్రయోజనం ఏమిటి?' అని ఆయన అన్న మాటలు ప్రతి తెలుగు వాడి గుండెను తాకాయి. ఆలోచనలను రేకెత్తించాయి.

'నేను పదవీ విరమణ చేశాను కానీ, పెదవీ విరమణ చేయలేదు' అని ఆయన ఒక సందర్భంలో అనడం ఆయనలోని నిరంతర దీక్షకు ఉదాహరణ. తన వాక్చాతుర్యంతో జాతినెపుడూ ఉత్తేజితం చేస్తుంటానని బావన. విశ్రాంతి ఎరుగని తపన ఆయనది.

ఒట్టి మాటలే కాదు, గట్టి చేతలూ ఆయన సొత్తు. కర్ణాటక(మైసూరు)లో నుండి ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని తిక్కన నడయాడిన నెల్లూరుకు తీసుకురావడం, ఆ సంస్థకు కావాల్సిన ప్రాథమిక అవసరాలను స్వయంగా చొరవ తీసుకుని సమకూర్చడం ఆయనకే చెల్లు. ఆయన భాషాభిమానానికి ఇది పరాకాష్ట.


ఆయనలోని మరో సుగుణం 'నాయకత్వం అంటే పెత్తనం కాదని, పెద్దమనిషిగా వ్యవహరించడం' అని ఆయన భావించడం, దాన్ని తు.చ. తప్పక ఆచరించడం. విద్యార్థి దశలో తోటి విద్యార్థికి తోడుగా నెల్లూరు కాంతారావుతో తలపడటం ఆయనలోని ధీరోదాత్త గుణానికి నిలువుటద్దం. ఆ సందర్భంగా పోలీసు అధికారి చేసిన సూచనలను, సలహాలను ఆయన తర్వాత ఎన్నో పోరాటాల్లో, బందుల్లో, సమ్మెల్లో అనుసరించాడు. ఖచ్చితంగా పాటించాడు. అదేమంటే ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించకుండా వుండటం. చిన్ననాటి నుండే 'మంచి'ని సులువుగా గ్రహించడం, దాన్ని గుర్తుపెట్టుకుని జీవితాంతం ఆచరించడం ఆయనలోని నిజాయితీకి నిదర్శనం.

రాజకీయ నాయకునికి ఉండవలసిన మరో ప్రత్యేక లక్షణం వెంకయ్యలో వుంది. ఈ విషయాన్ని రచయిత మాశర్మ గారు ఒకచోట ఇలా ఉదహరించారు. ఆత్మకూరులో బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి, వెంకయ్యనాయుడు మీద పోటీచేసి గెలిచారు. ఆయన మరణించాక ఆయన విగ్రహావిష్కరణకు వెంకయ్య వచ్చారు. "రాజకీయాల్లో ఉన్నప్పుడు నేను, సుందర రామిరెడ్డి వేరు వేరు పార్టీల నుంచి పోటీ చేశాం. అయితే, రాజకీయాల్లో ప్రత్యర్థులే తప్ప, శత్రువులు ఉండరు" అని ఆయన ఆ సందర్భంగా అన్నారు. ఆ మాటలు బలమైన ప్రజాస్వామ్యానికి పునాది అని వేరే చెప్పనక్కరలేదు. ఇంతకంటే నాయకుడికి కావాల్సిన గొప్ప స్వభావం ఏముంది?

ఆయనకు భాష మీద ఎంత అభిమానమో చరిత్ర మీద, సంస్కృతి మీద కూడా అంతే అభిమానం. "గుడ్ మార్నింగ్, గుడ్‌నైట్,.. ఎందుకు? అది గుడ్ నైటో, గుడ్ మార్నింగో మనకు తెలియదు కదా?.. ఏ సమయంలో నయినా నమస్కారం మన సంస్కారం" అంటారు ఆయన. ఎవరినయినా ఆయన అధిక్షేపించేటప్పుడు రోతగా మాట్లాడరు. బూతులు అసలే రావు, ఆయన మాటలు ఎబ్బెట్టుగా ఎట్టి పరిస్థితుల్లో ఉండవు. ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ఉన్నప్పటికీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ సూపర్ పవర్‌గా ఉంటున్నారని ఆరోపణలు వస్తుండేవి. ఆ సందర్భంలో వెంకయ్య గారు 'యు.పి.ఏ అంటే ఉల్టా, పల్టా అలయెన్స్ – పి.ఎం ప్రెసైడ్స్, మేడమ్ డిసైడ్స్' అని సున్నితంగా మందలించారు. అదే నాయకునికి ఉండవలసిన లక్షణం. ఎవరిని విమర్శించాడో, వారే నవ్వుకునే వారు. తమ తప్పు తెలుసుకోగలిగే వారు. వెంకయ్య మాటల్లో చమత్కారం, వ్యంగ్యం, సమయస్ఫూర్తి కలగలిసి వుంటాయి. ఒక్కోసారి ప్రత్యర్థుల చెంప చెళ్ళుమనిపిస్తాయి. నవ్వులు పూయిస్తాయి.

షికాగోలో 2018లో సెప్టెంబర్ 9న 'సెకండ్ వరల్డ్ హిందూ కాంగ్రెస్'లో వెంకయ్యనాయుడు కీలకోపన్యాసం ఇచ్చారు. విశేషం ఏమంటే – 1893లో అక్కడే స్వామీ వివేకానంద ఉపన్యాసం ఇచ్చి ఉన్నారు. అంటే 125 ఏళ్ళ తర్వాత వివేకానంద ఉపన్యాసం ఇచ్చిన చోటే మన వెంకయ్య ఉపన్యసించారు.

వెంకయ్యనాయుడులో కనిపించే మరో ముఖ్య సుగుణం.. వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించడం. కుమారుడు, కుమార్తెలను ఆయన రాజకీయాలలో ప్రవేశించకుండా చేసి, వారు స్వచ్ఛంధ సేవలో తలమునకలయివున్నారని చెప్తూ ఆనందిస్తుంటారు. ఇది గొప్ప నాయకుడికి వుండవలసిన మంచి లక్షణం. భారతదేశంలో వారసత్వ రాజకీయాల కొరకు పాకులాడే వారికి చెంపదెబ్బ.



రచయిత:
**మాశర్మ**


వెల: రూ. 500/–

పేజీలు: 301

తెలుగు / ఇంగ్లీషు ప్రతులకు:
సిద్ధు : 80082 04906
రూ. 300/- మరియు కొరియర్ ఛార్జీలు చెల్లించి కొరియర్ ద్వారా పొందవచ్చు

గ్రంథ రచయిత 'మాశర్మ' వెంకయ్య జీవితాన్ని తరచి, తరచి చూసి, చదివి, వివరాలు, విశేషాలను సేకరించి, గుదిగుచ్చి భావితరాలకు మార్గదర్శకంగా వుండేటట్లు గ్రంథ రచన చేశారు. ఆసాంతం ఆసక్తిగా చదవగలిగేటట్లు చేశారు. అందుకు తగినట్లు చక్కని వర్ణచిత్రాలను ప్రచురించారు. మంచి నాణ్యత గల పేపర్‌తో పుస్తకాన్ని ముద్రించి, పదికాలాల పాటు గ్రంథాలయాల్లో చెక్కుచెదరక నిలిచేటట్లు చేశారు. వెంకయ్య'నాయకుడు' (ఉదయగిరి నుండి ఉపరాష్ట్రపతి వరకు) ఒక స్ఫూర్తిప్రదాత జీవిత చరిత్ర అనే కాప్షన్‌తో వున్న ఈ గ్రంథం నిజంగానే భావితరాల రాజకీయ నాయకులకొక కరదీపిక, స్ఫూర్తిదాయని. సందేహం లేదు. ఇందుకు మాశర్మ అభినందనీయులు. వెంకయ్యనాయుడు మన నెల్లూరీయుడైనందుకు మనకందరికీ గర్వకారణం.

ప్రధాని మోడీ, జస్టిస్ ఎన్వీ రమణ, గ్రంథకర్త మాశర్మ ముందు మాటలతో ఉన్న ఈ గ్రంథంలో వెంకయ్యనాయుడి జీవితంలోని 22 దశలను 22 అధ్యాయాలుగా రచయిత అద్భుతమైన సులభశైలిలో వివరించి, పాఠకులను మంత్రముగ్ధుల్ని చేశారు. వెంకయ్యను భారతీయులందరికీ ఆత్మీయు, ఆదర్శనాయకునిగా తీర్చిదిద్దారు. రాజకీయాల్లో నిజాయితీగా ఎదగాలనుకునే వారందరూ తప్పక చదవలసిన ఉద్గ్రంథం ఇది!...



సమీక్ష: డా. గంగిశెట్టి శివకుమార్
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
ఫోన్ : 9441895243

# ఒత్తిడి లేకుండా వృత్తి ఎంపిక : విద్యార్థి భవితకి స్వతంత్ర దారి

వృత్తి ఎంపిక అనే నిర్ణయం ప్రతి విద్యార్థి జీవితంలో ఒక కీలక మలుపు. ఈ నిర్ణయం తీసుకునే సమయంలో విద్యార్థి మనసులో కలిగే సందిగ్ధత, భయం, ఒత్తిడి వంటివన్నీ సహజమే. కానీ ఈ ఒత్తిడి పెరిగి, విద్యార్థి స్వరాన్ని మింగేసే స్థాయికి చేరితే, భవిష్యత్తు దారి తప్పుతుంది. "స్వధర్మే నిధనం శ్రేయః" అని గీతా సూక్తి చెబుతుంది. మన స్వభావానికి, మన బలాలకు, మన అంతరంగానికి సరిపోయే మార్గమే శ్రేయస్కరం. వృత్తి ఎంపికకు కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాలి. ఒత్తిడి లేకుండా, స్పష్టతతో, స్వతంత్ర ఆలోచనతో తీసుకునే నిర్ణయం మాత్రమే విద్యార్థి జీవితాన్ని వెలుగులతో నింపుతుంది.

వృత్తి ఎంపికలో మొదటి దశ.. తమను తాము అర్థం చేసుకోవడం. చాలా మంది విద్యార్థులు తమ బలాలు, బలహీనతలు, ఆసక్తులు, విలువలు గురించి లోతుగా ఆలోచించరు. మార్కులు బాగుంటే డాక్టర్, ఇంజనీర్; మాట బాగుంటే లాయర్; డ్రాయింగ్ వస్తే ఆర్కిటెక్ట్... ఇలా సమాజం తయారుచేసిన సులభీకరణలు విద్యార్థి వ్యక్తిత్వాన్ని పట్టించుకోవు. కానీ "ఆత్మానం విద్ధి" అన్నట్లుగా, తమను తాము తెలుసుకోవడం అన్నది శాశ్వత సత్యం. ఉదాహరణకు, ఒక విద్యార్థి గణితంలో బలంగా ఉన్నా, అతనికి మనుషులతో పనిచేయడం, కమ్యూనికేషన్ అంటే ఇష్టం ఉంటే, అతను డేటా సైన్స్ కంటే మేనేజ్‌మెంట్ వైపు వెళ్లడం సహజం. మరోవైపు, బయాలజీని ప్రేమించే విద్యార్థి, రోగులను చూడడం తనకు ఇష్టం లేకపోతే, మెడిసిన్ కంటే బయోటెక్నాలజీ లేదా రీసెర్చ్ వైపు వెళ్లడం మంచిది. ఈ స్వీయ అవగాహన లేకుండా తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో అసంతృప్తికి దారి తీస్తాయి.

వృత్తి ఎంపికలో రెండో దశ..సమగ్ర సమాచార సేకరణ. ప్రపంచం వేగంగా మారుతోంది. పది సంవత్సరాల క్రితం లేని వృత్తులు నేడు ప్రధాన ప్రవాహంలో ఉన్నాయి. AI, UX డిజైన్, సస్టైనబిలిటీ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ అనలిటిక్స్, డిజిటల్ హెల్త్..ఇవిఅన్నీ కొత్త అవకాశాల ప్రపంచాన్ని తెరిచాయి. "కాలాయ తస్మై నమః".. కాలమే మార్పును నిర్ణయిస్తుంది. కాబట్టి విద్యార్థులు తమ ఆసక్తి రంగాల గురించి లోతుగా తెలుసుకోవాలి. ఆ రంగంలో పనిచేస్తున్న వారితో మాట్లాడాలి, ఇంటర్న్‌షిప్‌లు చేయాలి, ఆన్‌లైన్ కోర్సులు ప్రయత్నించాలి. ఉదాహరణకు, సైకాలజీపై ఆసక్తి ఉన్న విద్యార్థి కౌన్సెలింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, స్పోర్ట్స్ సైకాలజీ వంటి ఉపరంగాలను పరిశీలించాలి. ఈ పరిశోధన విద్యార్థికి స్పష్టతను ఇస్తుంది.

### తల్లితండ్రుల పాత్ర కీలకం :

వృత్తి ఎంపికలో మూడో అంశం.. తల్లిదండ్రుల పాత్ర. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం మంచి కోరుతారు, కానీ కొన్నిసార్లు తమ కలలను పిల్లలపై రుద్దుతారు. "పుత్రో నాస్తి స్వతంత్రతా" అనే పురాతన భావన ఇప్పుడు వర్తించదు. నేటి ప్రపంచం వ్యక్తిగత స్వేచ్ఛను, వ్యక్తిత్వ వికాసాన్ని గౌరవిస్తుంది. తల్లిదండ్రులు పిల్లల ఆసక్తులను వినాలి, వారి బలాలను గుర్తించాలి, మార్గనిర్దేశం చేయాలి కానీ నిర్ణయం మాత్రం పిల్లలదే కావాలి. ఉదాహరణకు, సంగీతంలో అసాధారణ ప్రతిభ చూపే విద్యార్థిని బలవంతంగా ఇంజనీరింగ్‌లోకి నెట్టడం అతని ప్రతిభను నశింపజేస్తుంది. తల్లిదండ్రులు పిల్లలతో ఓపెన్ డైలాగ్ చేయాలి. "నీకు ఏం ఇష్టం?", "ఏ పని చేస్తే నీకు ఆనందం కలుగుతుంది?", "ఏ రంగంలో నువ్వు గంటల తరబడి పని చేసినా అలసటగా అనిపించదు?" వంటి ప్రశ్నలు పిల్లల ఆలోచనలను వెలికి తీస్తాయి. వృత్తి ఎంపికలో నాలుగో అంశం..సమాజపు ఒత్తిడిని దాటడం. మన సమాజంలో పోలికలు చాలా సాధారణం. "అతని కొడుకు డాక్టర్ అయ్యాడు", "ఇతని కూతురు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్"–ఇలాంటి మాటలు విద్యార్థులపై అనవసర ఒత్తిడిని పెంచుతాయి. ఒక విద్యార్థి కళల్లో మెరిసి ప్రపంచ స్థాయి డిజైనర్ కావచ్చు; మరొక విద్యార్థి వ్యవసాయంలో కొత్త ఆవిష్కరణలు చేసి రైతుల జీవితాలను మార్చవచ్చు. సమాజపు అంచనాలు తాత్కాలికం; మన సంతృప్తి శాశ్వతం. ఐదో అంశం...వృత్తి ఎంపిక అనేది ఒకే సారి తీసుకునే నిర్ణయం కాదు. ఇది ఒక ప్రయాణం. నేటి ప్రపంచంలో కెరీర్ మార్పులు సహజం. ఒకరు ఇంజనీరింగ్ చేసి మేనేజ్‌మెంట్‌లోకి వెళ్లవచ్చు; మరొకరు అకౌంటింగ్ చేసి డేటా అనలిటిక్స్‌లోకి మారవచ్చు. "నదీ ప్రవాహం వలె జీవితం"..మార్పు సహజం. కాబట్టి విద్యార్థులు మొదటి నిర్ణయాన్ని జీవితాంతం బంధనంగా భావించకూడదు. నేర్చుకునే సామర్థ్యం, కొత్త నైపుణ్యాలను అలవర్చుకునే ధైర్యం ఉంటే, ఏ దశలోనైనా మార్పు సాధ్యమే.

### ఒత్తిడిలో నిర్ణయాలు తీసుకోవద్దు :

వృత్తి ఎంపికలో చివరి అంశం..మనసు ప్రశాంతంగా ఉండటం. ఒత్తిడిలో తీసుకునే నిర్ణయాలు తప్పు దారికి తీసుకెళ్తాయి. విద్యార్థులు ధ్యానం, యోగా, నడక, సంగీతం వంటి పద్ధతుల ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. "శాంతి పరమం సుఖం"..మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు తీసుకునే నిర్ణయాలు స్పష్టంగా, స్థిరంగా ఉంటాయి. ఉదాహరణకు, పరీక్షల ఒత్తిడిలో ఉన్న విద్యార్థి వృత్తి నిర్ణయం తీసుకుంటే, అతను తన అసలు ఆసక్తులను గుర్తించలేడు. కానీ సెలవుల్లో, ప్రశాంత సమయంలో ఆలోచిస్తే, అతని అంతరంగం నిజమైన దారిని చూపుతుంది. మొత్తానికి, వృత్తి ఎంపిక అనేది ఒక వ్యక్తిగత ప్రయాణం. ఇది మార్కుల ఆధారంగా కాదు; ఇది ఇతరుల అంచనాల ఆధారంగా కాదు; ఇది మన బలాలు, మన ఆసక్తులు, మన విలువలు, మన స్వప్నాల ఆధారంగా ఉండాలి. "ధర్మో రక్షతి రక్షితః"–మన స్వభావానికి, మన ధర్మానికి సరిపోయే వృత్తిని ఎంచుకుంటే, ఆ వృత్తి మన జీవితాన్ని రక్షిస్తుంది, మనకు ఆనందాన్ని ఇస్తుంది. ఒత్తిడి లేకుండా, స్వతంత్ర ఆలోచనతో, స్పష్టమైన అవగాహనతో తీసుకునే వృత్తి నిర్ణయం విద్యార్థి భవిష్యత్తును వెలుగులతో నింపుతుంది.



**వచ్చే వారం:** 15లో పునాది, 18లోదిశ, 21లో స్పష్టత : కెరీర్ రోడ్‌మ్యాప్

E-mail: reddyu@gmail.com



## లక్షలాది మంది భక్తులతో..

# క్రిక్కిరిసిన బారాషహీద్ దర్గా

**• వేడుకగా రొట్టెల పండుగ • నెల్లూరులో సందడే సందడి**

***నెల్లూరులోని పవిత్రమైన బారాషహీద్ దర్గాలో గత నెల 26 నుంచి ప్రారంభమైన రొట్టెలపండుగ వేడుకలు 30వ తేదీ వరకు అయిదురోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా, ప్రతి ఏటా నెల్లూరు నగరంలోని స్వర్ణాలచెరువు ఒడ్డున ఉన్న బారాషహీద్ దర్గాలో ఈ వేడుకలు జరుగుతుండడం తెలిసిందే. దర్గా నిర్వాహకులు, ఫెస్టివల్ కమిటీ, జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు క్షణం కూడా తీరికలేకుండా ఈ వేడుకలను పర్యవేక్షించారు. వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్‌తో పాటు, జిల్లాకి చెందిన మంత్రులు ఎప్పటికప్పుడు తగు సూచనలు చేస్తూ, రొట్టెల పండుగను విజయవంతం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, రాష్ట్రస్థాయి పోలీసు అధికారులు సైతం రంగంలోకి దిగి భక్తుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. దేశ విదేశాల నుంచి సుమారు 10 లక్షల మందికి పైగానే భక్తజనం బారాషహీద్ దర్గాని సందర్శించి, రొట్టెలపండుగలో కోర్కెల రొట్టెల పట్టుకున్నారు.***

నెల్లూరు నగరమంతా భక్తజన కోలాహలంతో నిండిపోయింది. దర్గా ప్రాంగణం విద్యుద్దీపకాంతులతో దేదీప్యమానమైంది. రొట్టెల పండుగ ఇక రెండు రోజుల్లో ప్రారంభమవుతుందనగానే భక్తులు తండోప తండాలుగా నెల్లూరుకు తరలి రావడం ప్రారంభించారు. ఆదివారం ఒక్క రోజునే కనీసం అయిదారు లక్షల మంది భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు అధికారులు చెప్తున్నారు. కోర్కెలు తీరిన వారు స్వర్ణాల చెరువులో రొట్టెలను వదలడం... కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు కళకళలాడాయి. ఆయా కోర్కెల రొట్టలకు అనుగుణంగా దర్గా నిర్వాహకులు ప్రత్యేక ఘాట్‌లను ఏర్పాటుచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూశారు. ఉద్యోగం రొట్టె, విద్యా రొట్టె, వివాహం రొట్టె, సంతాన రొట్టెలకు ఈసారి బాగా డిమాండ్ పెరిగింది.

### నేత్రపర్వంగా గంధ మహోత్సవం

శనివారం అర్ధరాత్రి నుంచి అత్యంత వైభవంగా బారాషహీదుల గంధమహోత్సవం జరిగింది. దర్గాలోని 12 వంది



స్వర్ణాల చెరువులో భక్తులతో మమేకమై రొట్టెను స్వీకరించిన కలెక్టర్ హిమాన్షుశుక్ల దంపతులు

అమరవీరుల సమాధులను అలంకరించి, 12 బిందెల్లో గంధాన్ని తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో ఆ సమాధులకు గంధలేపనం చేశారు. పవిత్రమైన ఆ గంధం కోసం భక్తులు పోటీపడ్డారు. సోమవారం తహలీల్ ఫాతెహా ఉత్సవం జరిగింది. రొట్టెల పండుగ 5 రోజుల్లో భక్తుల సంఖ్య సుమారు 10లక్షలకి పైగానే ఉంటుందని అంచనా. దర్గా సందర్శనతో పాటు, జిల్లాలోని కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలను కూడా వేలాదిమంది భక్తులు దర్శించుకున్నారు.

## కమనీయ కావ్యం..

# విశ్వనాథవారి 'కిన్నెరసాని'!

**ప్రముఖ కవయిత్రి ప్రొ. సుశీలమ్మ**



ప్రొ. సుశీలమ్మను సత్కరిస్తున్న జేకేరెడ్డి, కందనూరు మధు


జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'కిన్నెరసాని' పాటలు మానవ మనస్తత్వానికి ప్రతీకలని, నాటికీ నేటికీ ఏనాటికైనా అవి ప్రజలను ఆకట్టుకుంటూనే ఉంటాయని గుంటూరుకు చెందిన ప్రముఖ కవయిత్రి ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ చెప్పారు. జూన్ 28న చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతినెలా జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా, 174వ ప్రసంగంగా ఆమె 'విశ్వనాథ వారి కిన్నెరసాని సొబగులు' అనే అంశంపై ప్రసంగించారు. 1927 ప్రాంతంలో జయంతి పత్రికలో ఆ పాటలు ప్రచురితమయ్యాయని, పండిత పామర జనరంజకంగా ఉండే ఈ పాటలు బహుళ జనాదరణ పొందాయని తెలిపారు. భద్రాద్రికి వెళ్ళే దారిలో ఉన్న ఒక వాగు కొండను ఆనుకుని జలజలా ప్రవహిస్తుండడం చూసిన విశ్వనాథవారు ముగ్గురై నాలుగు పాత్రలతో కలిపి 'కిన్నెరసాని' కావ్యాన్ని తన అద్భుత కల్పనాచాతుర్యంతో ఎంతో రమణీయంగా రచించారని, కిన్నెరసాని పాటలు తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని అలంకరించాయని వివరించారు. తొలుత, వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జేకేరెడ్డి, కందనూరు మధు కవయిత్రిని శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. చెన్నైలోని అనేకమంది తెలుగు సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నెల్లూరులో 5న..'జాతీయ శతాధిక కవి సమ్మేళనం'

విశ్వసాహతి కళావేదిక–నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో జూలై 5వ తేదీన జాతీయ శతాధిక కవి సమ్మేళనం జరుగుతుందని ఆ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వన్నం బ్రహ్మయ్య, మురిగిపూడి సతీష్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు శానంపూడి మహేశ్వరి, కార్యదర్శి నర్మదలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనంలో పాల్గొనేవారు తమను సంప్రదించవచ్చని తెలిపారు. డీ.కే.డబ్ల్యూ ప్రభుత్వ కళాశాలలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ మరియు విశ్వసాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు కొల్లి రమావతి తదితరులు పాల్గొంటారని తెలిపారు. వన్నం బ్రహ్మయ్య రచించిన "అక్షర వసంతం" పుస్తకావిష్కరణ కార్యక్రమం మరియు 'సాహితీ తారకం' కార్యక్రమంలో భాగంగా, ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కవితా పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం కూడా జరుగుతుందని వారు పేర్కొన్నారు.


# కళ్యాణ వైభోగం...!

సుజిత్ - జోషిత



సన్ హేచరీస్ అధినేత మన్నెమాల రవిచంద్రారెడ్డి - జోతిర్మయిల కుమారుడు
**సాయి సుజిత్ - జోషిత**ల వివాహం
జూన్ 24వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభదీవెనెలు.

శ్రీలేఖ్య-సుకుమార్



నెల్లూరు వాస్తవ్యులు కొల్లి వెంకటసుబ్బారెడ్డి - అనితల కుమార్తె
(లేట్ శ్రీమతి శాంతాదేవి - లేట్ డా॥ దిలీప్‌రెడ్డిల మనుమరాలు) **శ్రీలేఖ్య - సుకుమార్**ల
పరిణయం జూన్ 24న హైదరాబాదులో, రిసెప్షన్ జూన్ 28న నెల్లూరులో ఘనంగా జరిగాయి.
నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

# గొడ్డలి పార్టీ వస్తే..మళ్ళీ అరాచకమే!

- పున్నపువారిపాళెం సభలో ముఖ్యమంత్రి స్పష్టీకరణ



అమరావతి అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ లేనిపోని విమర్శలు చేస్తోందని, రాజధాని అమరావతిపై ఆ పార్టీ పూటకోమాట రోజుకో ఆట అన్నట్లుగా వ్యవహరించడం దారుణమని, అలాంటి వారి మాటలు నమ్మవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. గొడ్డలి పార్టీని మళ్ళీ అధికారంలోకి తీసుకువస్తే రాష్ట్రంలో ఆరాచక పాలన ప్రారంభమవుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జులై 1 నెల్లూరుజిల్లా గూడూరు నియోజకవర్గంలోని పున్నపువారిపాళెంలో ఏర్పాటుచేసిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నామని అన్నారు. గతంలో ఉన్న అవినీతిపాలనను మార్చి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామన్నారు. ప్రజలకు ఎన్నోరకాల సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూ.. అభివృద్ధి–సంక్షేమ ధ్యేయంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా తాము సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా, పున్నపువారి పాళెంలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. లబ్దిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు.

తొలుత, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి సాదర స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి గూడూరుకి వచ్చినప్పుడు గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని కోరగా సానుకూలంగా స్పందించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పిన మాట ప్రకారం గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపారని అంటూ ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీసిటీలో జానపద.. భక్తి గీతాలాపనలు



పొల్లూరు జగన్నాథంని సత్కరిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ ఆధ్యాత్మిక సాంస్కృతిక వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీవాణి ఉగాది పురస్కార గ్రహీత, ఉపాధ్యాయులు పొల్లూరు జగన్నాథం ఆలపించిన జానపద భక్తిగీతాలు, పద్యాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గణపతి ప్రార్థనతో ప్రారంభమైన కార్యక్రమం, శ్రీ వెంకటేశ్వర స్తుతితో కొనసాగింది. "చిత్తశుద్ధి లేని భక్తిని దేవుడు మెచ్చడని" చెబుతూ, అనవసర పటాటోపాలకన్నా నిజమైన భక్తి ముఖ్యమని ఆయన ఒక పాటలో వివరించారు. గోవింద గోవింద అని కొలవరే, రఘుకుల తిలకా రారా, తిరుమల తిరుపతిలో.. వంటి గీతాలను మధురంగా గానం చేసి, ప్రేక్షకులను తన్మయులయ్యేలా చేశారు. జగన్నాథంతో పాటు ధరణిజ, ఇళంగోవన్ మరికొన్ని భక్తి కీర్తనలను ఆలపించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మరో అతిథి చంద్రశేఖరరెడ్డితో కలిసి పొల్లూరు జగన్నాథం ప్రతిభను అభినందించి, సన్మానించారు.

# నెల్లూరులో నెక్సస్ ఇన్నోవేషన్ హబ్

- 3న ప్రారంభం



రెనిల్ కొమిట్ల

సాఫ్ట్‌వేర్ రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారంచుట్టిన టెర్రాలాజిక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అధినేత రెనిల్ కొమిట్ల ఆధ్వర్యంలో జులైన 3న నెక్సాన్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం కానుంది. మాతృభూమిపై మమకారంతో, ఐటీ రంగాన్ని మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరింప చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా అడుగులు వేసిన తొలి తెలుగు టెక్కీగా రెనిల్‌ని చెప్పుకోవచ్చు. 2022లో నెల్లూరులో ఏర్పాటు చేసిన టెర్రాలాజిక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్రాంచ్ ద్వారా తొలుత వంద మందికి ఉపాధి అవకాశాలతో మొదలై, కొద్ది నెలల్లోనే 150 మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకుంది. సంస్థ అధినేత రెనిల్ కొమిట్ల కలలు కన్న నెల్లూరులో వెయ్యిమందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల లక్ష్యం మరెంతో దూరంలో లేదనిపిస్తుంది. ఈ సంస్థ వచ్చే ఆరు నెలల్లో 200 మంది ఉపాధి సామర్థ్యానికి చేరుకోనుంది.

ఐటీ రంగంలో టైర్2 నగరాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రెనిల్ వేసిన ముందడుగు సత్ఫలితాలనిస్తోంది. నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జూలై 3న నెక్సాన్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించనున్నారు. నెల్లూరు జిల్లాలో ఇది తొలి మల్టీనేషన్ పార్క్. భారతదేశంలోని టైర్–2 నగరాలు టెక్నాలజీకి కేవలం ఆతిథ్యం ఇవ్వడం కాదు, టెక్నాలజీని స్వయంగా నిర్మించగలవని చాటి చెప్పే ఈ ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మేయర్ సుజాత, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొననున్నారని ఆ సంస్థ వారు తెలిపారు.

## గ్రోసు సుబ్బారావు ఆధ్వర్యంలో..


# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు జూన్ 29న పలువురు గాండ్ల తెలికుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను బహుకరించారు. స్థానికంగా ఉన్న ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులందరూ కష్టపడి బాగా చదువుకుని సమాజంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించారు. ఇటీవల 10వ తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 18 మందికి, అదేవిధంగా ఇంటర్‌మీడియట్‌లోనూ మంచిఫలితాలు సాధించుకున్న మరో 20 మంది విద్యార్థులకు ఆయన నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. గాండ్ల తెలికుల సంఘీయులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా కూడా అభివృద్ధిని సాధించాలన్నదే తమ సంకల్పమన్నారు. గాండ్ల తెలికుల పింఛనర్లు, ఎంప్లాయిస్, టీచర్స్ (పీఇటీ) కూడా భాగస్వాములు కావాలన్న సదాశయంతో ఆ విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పీఇటీ విభాగం నాయకులు గ్రోసు సుబ్బారావును ఆత్మీయంగా సన్మానించారు. గాండ్ల, తెలికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి హరగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ వరికుంట్ల రాజా, కోశాధికారి సిరిగిరి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు గిద్దలూరి ప్రభాకర్‌రావు, బొర్రా మధుసూదన్, తిరుపతి లీలాకృష్ణ, సంఘం జిల్లా శాఖల అధ్యక్ష కార్యదర్శులు, పీఇటి కన్వీనర్లు పాల్గొన్నారు.

# చిలకలమర్రి అయ్యవారికి..ప్రధాని గ్రీటింగ్స్





ఒక చిన్న పాఠశాలలో పనిచేస్తున్న ఓ అయ్యవారికి పుట్టినరోజున సాక్షాత్తూ ప్రధాని నరేంద్రమోడీ నుంచి శుభాకాంక్షలు రావడం ఎంతైనా విశేషమే!.. ఆ అదృష్టం నెల్లూరు జిల్లా, అనంతసాగరం మండలం ఉన్నత పాఠశాలలో లెక్కల మాస్టారుగా ఉన్న చల్లా చంద్రశేఖర్‌రెడ్డికి దక్కింది. ఆ అయ్యవారు కేవలం విద్యార్థులకు పాఠాలు చెప్పడమే కాదు, కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మిషన్ కర్మయోగి' కోర్సుల్లో పాల్గొని, సుమారు 3వేల కోర్సులకు పైగానే పూర్తిచేసి జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఈ నేపథ్యంలో తనపుట్టినరోజైన జులై1న ఢిల్లీ నుంచి ప్రధాని మోడీ సంతకంతో ఉన్న బర్త్‌డే గ్రీటింగ్ కార్డు అందడంతో ఆయన ఆనందానికి అంతేలేదు.

# 'వర్క్ - స్టడీ' డ్యూయల్ మోడల్

(మొదటిపేజీ తరువాయి)

నేరుగా అనుసంధానమైన విద్యా విధానమని అన్నారు. ఈ కీలక సవాలుకు పరిష్కారం చూపే ప్రయత్నంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. ఎస్ఐయూ అమలు చేస్తున్న 'వర్క్–స్టడీ డ్యూయల్ మోడల్'కు శ్రీసిటీలోని బలమైన పారిశ్రామిక ఎకోసిస్టమ్ కీలకంగా నిలుస్తోందన్నారు. శ్రీసిటీలో 31 దేశాలకు చెందిన 250కి పైగా కంపెనీలు వివిధ రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయని, పరిశ్రమలు– విద్యావ్యవస్థలను ఇంత సమగ్రంగా అనుసంధానించిన కేంద్రాలు దేశంలోనే కాక ప్రపంచంలో కూడా చాలా అరుదని ఆయన అన్నారు. నాలుగేళ్ల డిగ్రీ చదివిన విద్యార్థి, మొదటి సంవత్సరం నుండే వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్‌ల ద్వారా రెండు సంవత్సరాలకు పైగా నిజమైన పరిశ్రమ అనుభవాన్ని సంపాదించి పట్టభద్రుడిగా బయటకు వస్తారని ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీసిటీఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఎస్ఐయు పాలకమండలి ఛైర్మన్ శ్రీనిరాజు తెలిపారు. దీనికితోడు, పరిశ్రమతో కలిసి రూపొందించిన పాఠ్యప్రణాళిక, విద్యార్థులకు అధిక ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. తొలుత, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మంత్రి లోకేష్‌ను, ఇతర అతిథులను సాదరంగా స్వాగతించారు. ఎస్ఐయు గ్లోబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు, పాలకమండలి ప్రతినిధులు, పరిశ్రమ భాగస్వాములు పాల్గొన్నారు.

### ఈ కొత్త విద్యా విధానానికి.. ఎస్ఐయు మార్గదర్శకత్వం :

కాగా, ఈ వినూత్న విద్యా విధానానికి.. 'వర్క్–స్టడీ డ్యూయల్ మోడల్ విద్యా విధానానికి'..ఎస్ఐయూ మార్గదర్శకత్వం వహిస్తుండడం విశేషం. దేశంలోని ప్రతి విద్యార్థి పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలతో పట్టభద్రుడై ఉపాధి అవకాశాలను పొందేలా రూపొందించిన వినూత్నమైన వర్క్–స్టడీ విధానానికి మనదేశపు ఉన్నత విద్య కీలక మలుపులో ఉన్న సమయంలో శ్రీకారం చుట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలో ప్రతి సంవత్సరం 90 లక్షల మందికి పైగా విద్యార్థులు పట్టభద్రులవుతున్నప్పటికీ, వారిలో కేవలం 42.6 శాతం మంది మాత్రమే ఉపాధికి తగిన నైపుణ్యాలను కలిగి ఉన్నట్లు అంచనా. ఉద్యోగాలు పొందిన వారిలో సగానికిపైగా తమ అర్హతలకు అనువుకాని ఉద్యోగాల్లో పనిచేస్తుండగా, 80శాతానికిపైగా సంస్థలు తగిన నైపుణ్యాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించడానికి ఆచరణాత్మక పరిష్కారాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ మోడల్‌ను రూపొందించడం విశేషం. ఎస్ఐయూ అమలుచేస్తున్న వర్క్–స్టడీ డ్యూయల్ మోడల్‌లో విద్యార్థులు తమ సమయాన్ని మూడింట ఒకవంతు క్యాంపస్‌లో అకడమిక్ విద్యను అభ్యసించేందుకు, మిగిలిన సమయాన్ని పరిశ్రమ భాగస్వామ్య సంస్థల్లో ఇంటర్న్‌లుగా పనిచేసేందుకు కేటాయిస్తారు. పరిశ్రమ భాగస్వామ్య సంస్థల్లో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్న విద్యార్థులకు తొలి సంవత్సరంనుంచే నెలకు కనీసం రూ.10,000 స్టైఫండ్ అందజేస్తారు. విద్యార్థుల నైపుణ్యాలు, ఉత్పాదకత పెరుగుతున్నకొద్దీ ఆ మొత్తాన్ని మరింత పెంచాలని కూడా పరిశ్రమ భాగస్వాములు భావిస్తున్నారు. దీంతో ఎస్ఐయూలో నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసే విద్యార్థులు సుమారు రెండేళ్లకుపైగా వాస్తవ పరిశ్రమ అనుభవంతో పట్టభద్రులుగా బయటకు వస్తారని ఎస్ఐయు వర్గాలు భావిస్తున్నాయి. పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థులు సొంతం చేసుకునేలా పాఠ్యప్రణాళికను పరిశ్రమ భాగస్వాములతో కలిసి రూపొందించారు. కృత్రిమమేధస్సు(AI) ఆధారిత పారిశ్రామిక రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలను ప్రతి సంవత్సరం నవీకరిస్తూ, భవిష్యత్ ఉద్యోగానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలను విద్యార్థులు పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యవస్థాపకతను ప్రోత్సహించేదిశగా ఎస్ఐయూ తన క్యాంపస్‌లో 'స్టేషన్–ఎస్' పేరుతో ఇంక్యుబేషన్ సెంటర్‌ని కూడా ఏర్పాటు చేసింది.

### ఈ ఏడాది 4 కోర్సులలో అడ్మిషన్లు..

2026–27 విద్యా సంవత్సరానికి ఎస్ఐయు నాలుగు అండర్ గ్రాడ్యుయేట్ కార్యక్రమాలను అందిస్తోంది. బి టెక్ ఇన్ కంప్యూటర్సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఏఐ), బి టెక్ ఇన్ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ (స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్), ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, డిజిటల్ మీడియా అండ్ కమ్యూనికేషన్స్‌లో బి.బి.ఎ కోర్సులతో 2026–27 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు www.thesiu.org ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాలకు సంబంధించిన వివరాల కోసం ఈమెయిల్: admissions@thesiu.orgను సంప్రదించవచ్చు.

# రానున్న కాలం.. ఈవీలదే

(మొదటిపేజీ తరువాయి)

ఏపీలో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఒప్పించామని సీఎం తెలిపారు. 2018లో తిరుపతిలో శంకుస్థాపన చేసిన హీరో మోటార్స్ ప్లాంట్ ఇప్పుడు పెద్ద ఎత్తున వాహనాలను ఉత్పత్తి చేస్తోందని, ఇప్పుడు 'వీడా' పేరుతో టూవీలర్ ఈవీలను ఉత్పత్తి చేయడం సంతోషంగా ఉందని అన్నారు. హీరో సంస్థకున్న అన్ని సెంటర్లకంటే శ్రీసిటీలోని సెంటరే అతిపెద్ద సెంటర్‌గా అభివృద్ధి చేయాలని సీఎం ఆకాంక్షించారు. ప్లాంట్ ఏర్పాటులో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని, ప్లాంట్‌ను త్వరితగతిన పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించాలని ఆయన సూచించారు. హీరో సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మెన్ పవన్ ముంజాల్ చెప్పిన విధంగా రూ.3200కోట్ల పెట్టుబడులకు సంబంధించిన పనులు కూడా ప్రారంభించాలని కోరుతున్నా నన్నారు. హీరో సంస్థలో పనిచేసే ఉద్యోగుల్లో 40శాతం మంది మహిళలే ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ మహిళలు కష్టపడి పనిచేస్తారని, త్వరగా నేర్చుకుంటారని ఆయన ప్రశంసించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి విప్లవాత్మక చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

# ఒక్క ఫోన్‌కాల్‌తో బస్సొచ్చేసింది

## • ఎమ్మెల్యే అంటే అలా ఉండాలి

ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవడం కాక, వెంటనే స్పందించడం నాయకుల కర్తవ్యం. ఆ కర్తవ్య నిర్వహణలో అందరికీ అందుబాటులో ఉండే నాయకుడు.. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. సామాన్యులు ఫోన్ చేసి తమ సమస్యలు చెప్పుకున్నా ఆయన వెంటనే స్పందించి తగు పరిష్కారం చూపుతారు. మొన్నటికి మొన్న ఒక ఓ సామాన్య ప్రయాణీకుడు. తమ వూరికి వెళ్ళేందుకు గంటల తరబడిగా ఉన్నా బస్సు రాలేదని వాపోవడంతో, ఆయన వెంటనే రంగంలోకి దిగారు. ఆ సామాన్య ప్రయాణికుడి వివరాలు కనుక్కొని సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వారి స్వస్థలమైన నంద్యాలకు బస్సును ఏర్పాటు చేయించారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుకు రొట్టెల పండుగకు వచ్చిన అహ్మద్ ఆసిఫ్ అనే భక్తుడు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకొని తన స్వస్థలమైన నంద్యాలకు వెళ్లేందుకు మధ్యాహ్నం 3 గంటల నుంచి వేచి ఉన్నాడు. కానీ, నంద్యాలకు వెళ్లే ఒక్క బస్సు కూడా రాలేదు. రాత్రి 7గంటలకు కూడా బస్సు లేకపోవడంతో ఆయనతో పాటు, అక్కడికి వెళ్లే ప్రయాణీకులంతా అయోమయంలో పడ్డారు. కొంతమంది చిన్నారులు వృద్ధులు కూడా నంద్యాలకు వెళ్లేందుకు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఆ ప్రయాణికుల ఇబ్బందులను చూసి, అహ్మద్ ఆసిఫ్ వెంటనే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ఫోన్ ద్వారా తెలిపారు. 'సార్!.. మీరు తప్ప మా ఫోన్లకి సమాధానం ఇచ్చే వారు కానీ, స్పందించేవారు కానీ లేరు. మాతోపాటు ఎంతోమంది నంద్యాలకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఎంతసేపు ఉన్నా..బస్సులు మాత్రం రావడం లేదు.. మాకు న్యాయం చేయాలంటూ ఆసిఫ్ కోరడంతో వెంటనే ఎమ్మెల్యే స్పందించారు. నెల్లూరు ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌తో మాట్లాడి రాత్రి 10 గంటలకు నంద్యాలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేయించారు. దీంతో, అక్కడున్న సుమారు వందమంది ప్రయాణికులు కోటంరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే అంటే అలా ఉండాలంటూ వారు ప్రశంసించారు.

## గడువు కంటే ముందుగానే..

# ములుముడి బ్రిడ్జి పూర్తి



మునుముడి కలుజుపై వంతెనను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, కోటంరెడ్డి సోదరులు

ములుముడి కలుజుపై వంతెనను అనుకున్న గడువుకన్నా ముందుగానే పూర్తిచేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రశంసించారు. జూన్ 28న జరిగిన ఈ వంతెన ప్రారంభోత్సవంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వంతెన మంజూరు చేసినప్పుడు ఆరు నెలల్లోనే నిర్మాణం పూర్తిచేయిస్తామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి మాట ఇచ్చారని, ఇప్పుడు ఆ సమయం కంటే ముందుగానే వంతెన నిర్మాణం కావడం సంతోషంగా ఉందని అన్నారు. వర్షాకాలంలో ఇక్కడ బ్రిడ్జి లేక ప్రజలు ఎంతో ఇబ్బందులు పడేవారని, ఇకనుంచి ఆ బాధలు తప్పినట్లేనని అన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఇదేవిధంగా పొట్టేపాళెం బ్రిడ్జిని కూడా నిర్మిస్తున్నామని, అది మరో రెండునెలల్లోనే పూర్తవుతుందని తెలిపారు. తాను పదేళ్ళలో చేయలేని ఎన్నో అభివృద్ధిపనులను కేవలం రెండు సంవత్సరాల్లోనే చేయిస్తుండడం తనకెంతో సంతృప్తిని కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రూరల్ ఎంపీపీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'అపోలో'లో.. 76 ఏళ్ల వృద్ధురాలికి

# విజయవంతంగా క్లిష్టమైన ఆపరేషన్




వివరాలను వెల్లడిస్తున్న అపోలో వైద్యులు

నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో ఇటీవల 76 ఏళ్ల వృద్ధురాలికి క్లిష్టమైన 'లాప్రోస్కోపిక్' శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. అపోలో హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ టి.జి.లక్ష్మీ దుర్గ ఈ విషయం తెలిపారు. ఆ వృద్ధురాలు గర్భాశయం కిందకు జారిపోయిన స్థితిలో తమ వద్దకు వచ్చారని, మూత్ర విసర్జనలో అసౌకర్యంగా ఉండటంతో ఆమె తీవ్రమైన ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించామని చెప్పారు. దానికి తోడు ఆమెకు గత కొంత కాలంగా హైబీపి, మధుమేహం, ఉబ్బసం వంటి తీవ్రమైన సమస్యలు కూడా ఉన్నట్లు పరీక్షల్లో గుర్తించామన్నారు. ఆ వృద్ధురాలి బాధలకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశ్యంతో కోత లేని లాప్రోస్కోపిక్ పద్ధతి ద్వారా అత్యంత అధునాతన పద్ధతిలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. తద్వారా వృద్ధురాలి గర్భాశయాన్ని తొలగించామని, రెండు వైపులా ఉండే ఫాలోపియన్ ట్యూబులు కూడా తొలగించి, పాలిప్రొపైలిన్ మెష్ అనే ఒక రకమైన నెట్ అమర్చామన్నారు. శస్త్ర చికిత్స అనంతరం రోగి వేగంగా కోలుకుందని, ప్రస్తుతం ఆమె పూర్తి ఆరోగ్యంతో ఉన్నారన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ విశ్వేశ్వర్‌రెడ్డి, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# వరిగొండ మస్తానయ్య



రిటైర్డ్ మండల డెవలప్‌మెంట్ అధికారి వరిగొండ మస్తానయ్య జూన్ 27వ తేదీ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 90 సంవత్సరాలు. సుదీర్ఘ కాలం పంచాయతీరాజ్ శాఖలో వివిధ హోదాలలో మస్తానయ్య తన సేవలందించారు. 1996లో కోవూరు ఎండిఓగా పదవి విరమణ పొందారు. మృదుస్వభావిగా, అంకిత భావంతో పనిచేసే అధికారిగా మస్తానయ్యకి ఆ శాఖలో మంచి పేరుంది. విధి నిర్వహణలో పలు సందర్భాలలో తన ఉన్నతాధికారుల ప్రశంసలు, పొగడ్తలు అందుకునేవారు మస్తానయ్య. ఆయన స్వగ్రామం అనికేపల్లి. మస్తానయ్య సతీమణి శ్రీమతి శారదమ్మ కొన్నేళ్లక్రితం కాలం చేశారు. ఆయనకి ఇద్దరు కుమారులు మస్తాన్ బాబు, మధుశేఖర్, ఇద్దరు కుమార్తెలు కామాక్షి, మధురిమ ఉన్నారు. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డికి మస్తానయ్య అత్యంత ఆప్తమిత్రుడు. మస్తానయ్య స్మృతికి నివాళులర్పిస్తూ వారి కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



## నమ్మకమే పెట్టుబడిగా - నాణ్యమైన కట్టుబడితో

# 50 యేళ్ళ ప్రయాణం - అలుపెరుగని ప్రస్థానం

## • నిర్మాణ రంగంలో సంచనాలకి సారథిగా బోగొల్లు మోహన్‌రెడ్డి

*"కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు... మహా పురుషులవుతారు" అన్నాడో కవి.*

*ఆ మాటలని అక్షర సత్యం చేస్తూ... తమ తమ రంగాలలో అద్భుతాలు సృష్టిస్తూ... సింహపురి ఖ్యాతిని ప్రపంచ నలుదిక్కులా వ్యాపింప చేస్తున్నారు ఎంతోమంది నెల్లూరీయులు. అలాంటి వారిలో ఒకరే అగ్రగామి ఆర్కిటెక్ట్ బోగొల్లు మోహన్‌రెడ్డి. ప్రాథమిక, ఉన్నత విద్యలని నెల్లూరులో పూర్తిచేసిన అనంతరం ఆయన బెంగళూరుకు వెళ్లారు. అక్కడ బెంగళూరు విశ్వవిద్యాలయం నుండి భవన రూపశిల్ప విభాగం (ఆర్కిటెక్చర్)లో ప్రావీణ్యం సంపాదించి పట్టా అందుకున్నారు. కొంతకాలం ప్రభుత్వ విభాగంలో పనిచేసిన మోహన్‌రెడ్డి తన విధులతో సంతృప్తి చెందలేదు. 1970వ దశకంలో తన సొంత పేరుతో మోహన్ అసోసియేట్స్ అనే సంస్థని నెల్లూరులో ప్రారంభించారు.*

ఆర్కిటెక్చర్ విభాగంలో పూర్తిస్థాయి నైపుణ్యం కలిగిన భవన రూపశిల్పిగా మోహన్‌రెడ్డి అనతి కాలంలోనే మంచి గుర్తింపును సాధించుకున్నారు. ఇప్పుడు ప్రపంచమంతా ప్రసిద్ధి చెందుతున్న విల్లాల (ఇండిపెండెంట్ హౌస్) సంస్కృతిని 1980వ దశకంలోనే నెల్లూరు నగరానికి పరిచయం చేసిన ఘనత మోహన్‌రెడ్డిది.

మోహన్‌రెడ్డి శిష్యరికంలో అనేకమంది ఐటిఐ విద్యార్థులు భవన రూపకల్పన, నిర్మాణ విభాగాలలో ఆయన దగ్గర శిక్షణ పొందేవారు.

### మహానగరాలలో సైతం నెం.1గా గుర్తింపు!

నెల్లూరులో తన కార్యకలాపాలను కొనసాగిస్తూనే, మద్రాసు, బెంగళూరులలో కూడా కొన్ని నిర్మాణాలకు సారథ్యం వహించడం మొదలుపెట్టారు మోహన్‌రెడ్డి. అప్పుడప్పుడే సినిమా రంగంలో గుర్తింపు తెచ్చుకుంటున్న ఇప్పటి మెగాస్టార్ చిరంజీవికి చెన్నైలో మొట్ట మొదటి సొంత ఇల్లు కట్టింది మోహన్‌రెడ్డే. ఇక్కడే ఆయన హస్తవాసి గురించి ఒక్కసారిగా చెన్నై, బెంగళూరు, హైదరాబాదు సర్కిల్స్‌లో మారుమ్రోగి పోయింది. అప్పటికే మంచి హిట్‌సినిమాలతో తన సినీరంగ జీవితానికి బంగారుబాటలు వేసుకుంటుండిన చిరంజీవి కొత్తింట్లో చేరిన తరువాత నటించిన తొలి సినిమా 'ఖైదీ' సూపర్‌డూపర్ హిట్ సినిమాగా సంచలన విజయాన్ని సాధించింది. మోహన్‌రెడ్డి ఇల్లు కడితే ఆ ఇల్లు వాస్తు పరంగా కలిసొస్తుందని, ఆయన చెయ్యి కూడా మంచిదనే ప్రచారం జోరుగా జరిగింది. తమ ఇంటి నిర్మాణ రూపకల్పనకి ఆయన ఒప్పుకుంటే చాలన్నంత క్రేజ్ మోహన్‌రెడ్డికి ఏర్పడింది. ఒక విధంగా అది నిజమే. ఈరోజు హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, నెల్లూరులలో ప్రముఖంగా ఎదిగిన సంస్థలకు, వ్యక్తులకు ప్రారంభదశలో మోహన్‌రెడ్డే భవన రూపశిల్పి. చిరంజీవి ఇల్లు పూర్తైన వెంటనే సూపర్ స్టార్ కృష్ణ దగ్గరనుండి పిలుపొచ్చింది. నీలకంఠ మెహతా స్ట్రీట్‌లో ఆయన కట్టబోతున్న ఇల్లు రూపకల్పన చేయవలసిందిగా కోరారు కృష్ణ. కృష్ణ ఇల్లు నిర్మాణంలో ఉండగానే తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ మోహన్‌రెడ్డిని పిలిచి పెద్ద బాధ్యతను అప్పజెప్పారు. కోడంబాక్కంలో ఆయన కొత్తగా నిర్మించ తలపెట్టిన భారీ కళ్యాణ మండపాన్ని డిజైన్ చేయడంతోపాటు నిర్మాణ పర్యవేక్షణ బాధ్యత కూడా తననే చూడమని మోహన్‌రెడ్డిని కోరారు. ఈ అవకాశం మోహన్‌రెడ్డి జీవితంలో అతిపెద్ద మలుపు. రజనీకాంత్ అప్పజెప్పిన పనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రికార్డు వ్యవధిలో నిర్మాణం పూర్తిచేసి అందించారు. 1989లో రాఘవేంద్ర మండపం ప్రారంభోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. నాటి తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధితో పాటు అనేక భాషలకు చెందిన ప్రముఖ సినీనటులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అప్పట్లో ఒక్క తమిళనాడులోనే కాకుండా దక్షిణ భారత దేశమంతా ఈ వార్త పెద్ద సంచలనమయ్యింది. మోహన్‌రెడ్డి పేరు కూడా మారుమ్రోగి పోయింది. అప్పటికే ఆయన తమ సంస్థ మోహన్ అసోసియేట్స్‌ని చెన్నైలో కూడా ప్రారంభించారు.

### నిర్మాణ సారథ్యంలో అగ్రగామిగా!

క్వాలిటీలో, తక్కువ సమయంలో నిర్మాణాన్ని పూర్తిచేయడంలో, ఆధునిక డిజైన్ల రూపకల్పనలో మోహన్‌రెడ్డి మొదటిశ్రేణిలో నిలిచారు. ఆయనకు నిర్మాణ బాధ్యత అప్పచెప్తే నిశ్చింతగా ఉండొచ్చన్న భరోసాని కల్పించారు. తిరుమలలో తిక్కవరపు సుబ్బ రామిరెడ్డి నిర్మించిన "ఇందిరా గెస్ట్‌హౌస్", ఆతిథ్య ప్రముఖుడు ఇండియా హోటల్స్ ఛైర్మెన్ లలిత్ సూరికి చెందిన అతిథి భవనం, ప్రియా సిమెంట్స్ నిర్మించిన కాటేజ్‌కు కూడా మోహన్‌రెడ్డే సారథ్యం వహించారు. మద్రాసులో ప్రముఖ సినీనటి, మాజీ పార్లమెంటు సభ్యురాలు వైజయంతిమాలకు చెందిన భారీ వ్యాపార సముదాయం, నటులు, నిర్మాతలు శరత్‌కుమార్ రాధికల నివాస గృహం, మాజీ చీఫ్‌జస్టిస్ సుభాషణ్ రెడ్డికి సంబంధించిన కమర్షియల్ కాంప్లెక్స్, నిర్మాతల మండలి అధ్యక్షులు మల్లెమాల శ్యాంసుందరరెడ్డి స్వగృహాలకు కూడా రూపకల్పన చేసి తన స్వీయ పర్యవేక్షణలో అతితక్కువ సమయంలో అత్యంత నాణ్యతతో నిర్మించి ఇచ్చారు మోహన్‌రెడ్డి.






### తిరుగులేని ప్రస్థానం..!

నెల్లూరులో నారాయణ విద్యాసంస్థలకు సంబంధించిన వైద్య, దంత కళాశాల భవనాలను రోమన్ ఆర్కిటెక్చర్‌తో అతితక్కువ సమయంలో పూర్తిచేసి ఇచ్చారు. అనుకున్న సమయానికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో తానే స్వయంగా 3 నెలలపాటు రాత్రీ పగలు శ్రమించి తన పర్యవేక్షణలో ఈ భారీ సముదాయాలను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు మోహన్‌రెడ్డి. మద్రాసులోని మాయాజాల్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్, మయాన్స్ కన్‌స్ట్రక్షన్స్ ఇంజనీర్స్‌తో పాటు ఇంకా హైదరాబాదు, బెంగళూరు వంటి మహానగరాలలో వైట్‌స్టోన్ బిల్డర్స్, వంశీరామ్ బిల్డర్స్, నీవీ ప్రాపర్టీ డెవలపర్స్(ప్రియా సిమెంట్స్), నార్త్‌స్టార్ హోమ్స్, వాసుదేవ రియల్టర్స్, అశోక్ బిల్డర్స్, రైన్ కాల్సింగ్ లిమిటెడ్, పిడిఆర్ & కో, రాజపుష్ప డెవలపర్స్, స్వర్ణ బిల్డర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పౌలోమి ఎస్టేట్స్, కాంక్రీట్ కన్‌స్ట్రక్షన్స్, బిజిఆర్ & కో వంటి ప్రతిష్టాత్మకమైన ప్రముఖ సంస్థలన్నిటికీ ఆర్కిటెక్చర్ మరియు నిర్మాణ సారథి మోహన్‌రెడ్డే.

చెన్నైలోని ఈసిఆర్ రోడ్డులో అతి విలాసవంతమైన భారీ లగ్జరీ విల్లాలను మయాన్స్ గేటెడ్ కమ్యూనిటీ పేరుతో నిర్మించారు మోహన్‌రెడ్డి. చెన్నై నగరంలో అతి విలాసవంతమైన, అతి సుందరమైన గృహప్రాంగణంగా 'మయాన్స్' విల్లా ప్రాజెక్టుకు 2017లో జరిగిన 'దుబాయ్ రియాల్టీ షో'లో టైమ్స్ ఆఫ్ ఇండియా వారి 'బెస్ట్ ప్రాజెక్ట్' అవార్డు లభించింది. మద్రాసులో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న 'మాయాజాల్' సినిమాహాళ్ళ ప్రాంగణంలో 16 థియేటర్లను అతితక్కువ సమయంలో అత్యాధునిక సౌకర్యాలతో అంతర్జాతీయ స్థాయిలో అంతర్గత అలంకరణ(ఇంటీరియర్ డిజైనింగ్) చేసి కేవలం ఆర్కిటెక్చర్ నిర్మాణంలోనే కాకుండా, ఇంటీరియర్ డిజైనింగ్‌లో కూడా తన ప్రతిభను చాటుకున్నారు మోహన్‌రెడ్డి. ఈ సినిమాహాళ్ళ ప్రాంగణానికి 2018 సంవత్సరానికి గాను "ఉత్తమ మల్టీప్లెక్స్" అవార్డు కూడా లభించింది.

తన పేరుతోనే సంస్థను ప్రారంభించి మోహన్‌రెడ్డి అంటే ఒక బ్రాండ్‌గా తన ప్రస్థానాన్ని తీర్చిదిద్దుకున్నారు ఈ అభినవ ఆధునిక ఆర్కిటెక్ట్ బ్రహ్మ. మోహన్‌రెడ్డి సంస్థ త్వరలో 50 వసంతాలు పూర్తి చేసుకోబోతున్న తరుణంలో 'లాయర్' అభినందనలు!



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com